విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

ఆదివారం 15 సెప్టెంబరు 2024 8 పేజీలు

రాజీమార్గమే

రాజమార్గం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేందర్

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : రాజీమార్గమే రాజమార్గం అని భావించి కక్షిదారులు తమ పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ నరేందర్ సూచించారు. కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని న్యాయస్థానాల సముదాయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న జాతీయలోక్ అదాలత్ తీరుతెన్నులను శనివారం పరిశీలించారు. మొదటి ఏడిజె న్యాయస్థానంలో ఉడుముల ప్రసాద్, భారతీయ యాక్సా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ మధ్య రాజీ కుదిర్చి పాస్ చేసిన ప్రమాద భీమా రూ. 21.50 లక్షల అవార్డును కక్షిదారునికి అందజేశారు. శనివారం నగరంలోని న్యాయస్థానాల ప్రాంగణానికి వచ్చిన రాష్ట్ర హైకోర్టు -మిగతా 2 లో ...

ఆర్థిక, పారిశ్రామిక రంగాలను

కార్పొరేట్‌కు దోచిపెడుతున్నారు

సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : దేశ ఆర్థిక, పారిశ్రామిక రంగాలను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతుందని సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. గుంటూరు శారదాకాలనీ ఆర్చి సెంటర్ వద్ద అమరజీవి కామ్రేడ్ మామిళ్ళపల్లి మాలకొండయ్య 41వ వర్ధంతి, అమరజీవి కామ్రేడ్ గుర్రం బ్రహ్మయ్య 43వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభకు 48వ డివిజన్ సీపీఐ శాఖ కార్యదర్శి ఇరిగినేని వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల అజయ్‌కుమార్ ప్రసంగిస్తూ కామ్రేడ్ మాలకొండయ్య తన తుదిశ్వాస విడిచే వరకు కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారని అన్నారు. నగర కమ్యూనిస్టు ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారని గుర్తుచేశారు. నేడు దేశంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు లెక్కలేనన్ని సార్లు పెంచినందువల్ల వాటి ప్రభావం దేశంలో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలపై పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్య జీవిత అవసర సరుకులు ఆకాశాన్ని అంటాయని అన్నారు. మోదీ ముఖ్య సన్నిహితుడు, గుజరాత్ పెట్టుబడిదారుడు దేశ ఆర్థిక వ్యవస్థను -మిగతా 2 లో ...

ఆపరేషన్ బుడమేరు

అమలుచేయాలి

వరద బాధితులకు భోజనం పంపిణీలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

విశాలాంధ్ర-విజయవాడ: అక్షయ ఫౌండేషన్ సౌజన్యంతో, దోనేపూడి కిరణ్ సహకారంతో శనివారం 56వ డివిజన్ పాత రాజరాజేశ్వరి పేట సాయిబాబా గుడిసెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో వరద బాధితులకు భోజన ఏర్పాట్లు, పిల్లలకు 600 బ్రెడ్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ బుడమేరు సహాయక కార్యక్రమాలు మరింత వేగవంతంగా అమలు చేయాలన్నారు. బాధితులకు నష్టపరిహారం చెల్లింపులకు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. 56వేల ఇళ్ళు మునిగాయని, 33 వేల ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయని మంత్రి ప్రకటించారని తెలిపారు. నష్టపోయిన వారికి -మిగతా 2 లో ...

ప్రతి ఒక్కరి కష్టాన్ని తీరుస్తాం

- పారదర్శకమైన నష్ట వివరాల నమోదుకు రీవెరిఫికేషన్
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.సృజన

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో ముంపుకు గురై నష్టపోయిన బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేసి వారిని కష్టాల నుంచి గట్టెక్కించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నష్టాల వివరాలను నమోదు చేయడం జరిగిందని, అత్యంత పారదర్శకంగా నివేదికలను రూపొందించి ఈ నెల 15న రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు ప్రత్యేక బృందాలతో రీవెరిఫికేషన్(క్రాస్ చెక్) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.జీ.సృజన తెలిపారు. నగరంలోని సింగ్‌నగర్ వాంబే కాలనీ ప్రాంతంలో కలెక్టర్ శనివారం పర్యటించి నష్ట వివరాల డేటా రీవెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వరద ముంపు నష్టాల నమోదు ప్రక్రియను దాదాపు పూర్తిచేయడం జరిగిందన్నారు. ఏ కారణంచేతనైనా నష్టాల వివరాలు -మిగతా 2 లో ...

వీధివిక్రయ దారులకు రూ.50వేలు నష్ట పరిహారం ఇవ్వాలి-2

ఉపాధ్యాయుల సర్దుబాటు లోపాలు సరిచేయాలి-5లో..

ఆక్రమణలు ఉపేక్షించం

పది రోజుల్లో తొలగించుకోండి : గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విజయవాడలో వరదలు చేసిన నష్ట అనుభవంతో గుంటూరు నగరంలో మురుగు పారుదలకు అడ్డుగా ఉన్న డ్రైన్లపై ఆక్రమణలను సమగ్రంగా తొలగిస్తామని, దీనికి నగర ప్రజలు, ప్రజాప్రతినిధులు కూడా సహకరించాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయవాడలో వరద -మిగతా 2 లో ...

తొలగని కష్టాలు..!

- సింగ్‌నగర్ రింగ్‌రోడ్లులో 11 చోట్ల భారీ గండ్లు
- జలదిగ్బంధంలోనే నందమూరినగర్ వాసులు-3లో..

(మొదటి పేజీ తరువాయి)

రాజీమార్గమే రాజమార్గం

న్యాయమూర్తి జస్టిస్ నరేందర్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. హైకోర్టు న్యాయమూర్తి నరేందర్‌కు జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా 9వ ఏ డి జె న్యాయస్థానంలో 411 ఐపిసి సెక్షన్ కింద దాఖలైన క్రిమినల్ కేసుకు సంబంధించి ఇరు పార్టీలకు రాజీ కుదిర్చి ఇకపై సయోధ్యగా మెలగాలని పాస్ చేసిన అవార్డును హైకోర్టు న్యాయమూర్తి వారికి అందచేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జనరల్ వై. లక్ష్మణరావు, సభ్య కార్యదర్శి ఎం. భవిత, ఉపకార్యదర్శి హెచ్. అమరలింగేశ్వరరావు, న్యాయమూర్తులు కేవి. రామ కృష్ణయ్య, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్ చినబాబు, సుజాత, తదితర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బూరగడ్డ అశోక్ కుమార్, కక్షిదారులు, ప్రజలు, న్యాయవాదులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దోచిపెడుతున్నారు

కొల్లగొట్టినందువల్ల దేశ ఆర్థిక వ్యవస్థ కూనారిల్లుతుందని అన్నారు. 28 మంది బ్యాంకు ఎగవేతదారులలో అత్యధిక కార్పొరేట్లు గుజరాత్ పెట్టుబడిదారులేనన్నారు. మోదీ సన్నిహితులు ముకేశ్ అంబానీ, గౌతమ్ ఆదానీలు ప్రపంచ కుబేరులతో పోటీపడుతుంటే మన దేశ జీడీపీ రేటు పాతాళంలో కుంగిపోయిందన్నారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ ఆచరణలో మాత్రం ముందుకు సాగలేదన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం ఇలాగే కొనసాగితే ఆకలి చావులు ఏర్పడే ప్రమాదం ఉందని, అన్ని వర్గాల ప్రజలు మోదీ పాలనకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ శారదాకాలనీ నిర్మాణంలో, సంజీవయ్య నగర్ ఏర్పాటులో మాలకొండయ్య కీలకమైన పాత్ర పోషించారని అన్నారు. శారదాకాలనీ రిజిస్ట్రేషన్ కోసం స్థానిక సీపీఐ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. వెల్ఫేర్ సెంటర్ అభివృద్ధిలో సీపీఐది ముఖ్యపాత్ర అని అన్నారు. మాలకొండయ్య స్ఫూర్తితో గుంటూరు నగర సమగ్రాభివృద్ధి కోసం సీపీఐ నిర్వహించే పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. తొలుత పార్టీ పతాకాన్ని జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ పతాకాన్ని వైఎఫ్ జిల్లా పూర్వ కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ ఆవిష్కరించారు. మాలకొండయ్య చిత్రపటానికి నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండు రవి, మంగా శ్రీనివాసరావు, రావుల అంజిబాబు, ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి చెవుల పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలకొండయ్య, బ్రహ్మయ్యలకు నివాళులు

స్థానిక శారదాకాలనీ స్తూపం సెంటర్‌లో కామ్రేడ్ మామిళ్ళపల్లి మాలకొండయ్య 41వ వర్ధంతి, గుర్రం బ్రహ్మయ్య 43వ వర్ధంతి సందర్భంగా సీపీఐ మాజీ కౌన్సిలర్, మాలకొండయ్య కుమార్తె డాక్టర్ అరుణ, కుమారుడు శ్రీకృష్ణ, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తదితరులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ 5వ డివిజన్ కార్యదర్శి దండు రవీంద్రబాబు, 48వ డివిజన్ కార్యదర్శి విరిగినేని వెంకటేశ్వరరావు, యోగయ్య సుబ్బారావు, కొండయ్య, లక్ష్మయ్య, మాల్యాద్రి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ బుడమేరు అమలు చేయాలి

పెద్ద మొత్తంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నగదు చెల్లించాలన్నారు. బుడమేరు ఆపరేషన్ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని పేదలకు నష్టం జరగకుండా ఆక్రమణలు తొలగించాలని ఆపరేషన్ అమలు చేయాలని కోరారు. భోజన ఏర్పాట్లు చేసిన అక్షయ ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి లంక దుర్గారావు మాట్లాడుతూ బుడమేరు ముంపుకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించి ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలన్నారు. వరద బాధితులకు సహాయ కార్యక్రమాలలో సీపీఐ శ్రేణులు పాల్గొని సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వర్గసభ్యులు బుట్టి రాయప్ప, కేవీ భాస్కరరావు, అప్పురబోతు రాము, పంచదార్ల దుర్గాంబ, సీపీఐ నాయకులు పగిడికత్తుల రాము, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు, లంకేసాయి, బాషా, నారాయణ, ఈశ్వర్, మనోజ్ నాయుడు, నాగరాజు, కాజా, కె.విజయ్, మహిళా నాయకులు దిల్‌షాద్, మున్నీ తదితరులు పాల్గొన్నారు.

వీధివిక్రయ దారులకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర-విజయవాడ: విజయవాడ నగరంలో వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రతి వీధివిక్రయ దారులకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయం మంజూరు చేయాలని ఏపీ వీధివిక్రయదార్ కార్మిక ఫెడరేషన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక హనుమాన్‌పేట దాసరి భవన్‌లో నగర ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ వీధివిక్రయదారులకు చేయూతనివ్వాలని వీధివిక్రయదారుల కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర సమితి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయటం జరిగిందన్నారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం నుంచి విజయవాడ మున్సిపల్ కమీషనర్‌కు ఆదేశాలు రావటం జరిగిందన్నారు. వీధివిక్రయదారుల కింద అనేక బాగాల్లో ఉన్న చిరు వ్యాపారస్తులు, వివిధ చేతివృత్తిదారులు ఉన్నారని చెప్పారు. విజయవాడ నగరంలో 64 డివిజన్‌లో 75 శాతం వర్షాలు, వరదలతో 100% మునిగిపోవటం జరిగిందన్నారు. 32 నుంచి 35 డివిజన్‌ల వరకు ప్రతి వీధి విక్రయదారుడు నష్టపోయారని తెలిపారు. విజయవాడలో భారీగా నష్టపోయిన వారు ఉన్నారు ప్రతి ఒక్కరికి 50 వేల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.వర్షాలు మరియు వరదలు వాళ్లని నష్టపోయిన ప్రతి ఒక్కరిని సర్వే చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ వీధివిక్రయదారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. వీధివిక్రయదారుల చట్ట ప్రకారంగా సర్వే ద్వారా విజయవాడ నగరంలో 1,50,000 మందిని వీధివిక్రయదారులు గుర్తించాల్సిన ఉందన్నారు. ప్రతి వీధి విక్రయించదానికి ఫోటో గుర్తింపు కార్డు, కుటుంబం ఫోటోతో వ్యాపార భద్రత, వ్యాపార అనుమతి పత్రం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీధివిక్రయదారుల కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెద్దువెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కొట్టి రమణారావు, ఏఐటీయూసీ విజయవాడ నగర సమితి అధ్యక్షుడు కేఆర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి మూలీ సాంబశివరావు, నాయకులు వై.బాలకృష్ణ, మల్లేశ్వరి స్థానిక వీధివిక్రయ దారుల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి కష్టాన్ని తీరుస్తాం

నమోదుకాని వారికి సంబంధిత సచివాలయాల ద్వారా మరో అవకాశం కల్పించి ఎన్యూమరేషన్ బృందాలు పరిశీలించిన వివరాలను యాప్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. నష్ట వివరాలను నమోదుచేసి, నష్టపోయిన ప్రతి బాధితునికీ సాయమందించి వారిని కష్టాల నుంచి గట్టెక్కించి ఆదుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పారదర్శకంగా నివేదికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ముంపునీటి కారణంగా నష్టపోయిన గ్రౌండ్ ఫ్లోర్ నివాసితులతో పాటు మొదటి అంతస్తులో ఎలాంటి నష్టం జరిగినా వాటి వివరాలను కూడా సేకరించి నివేదికలో పొందుపర్చాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో తహశీల్దార్ సీహెచ్.శిరీషాదేవి, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలు ఉపేక్షించం

ప్రభావిత ప్రాంతాల్లో జీఎంసీ తరుపున చేపట్టిన సహాయక చర్యలు, డ్రైన్ల ఆక్రమణలు, పారిశుధ్యం, స్ట్రీట్ వెండింగ్ జోన్లు, జీఎంసీ ఆదాయ వనరుల పెంపుకు కార్యాచరణ, స్వచ్ఛతా హి సేవా అంశాలపై మాట్లాడారు. వరద ప్రభావంతో విజయవాడ నగరం తీవ్రంగా నష్టపోయిందని, అందుకు వర్షం నీరు డ్రైన్లలోకి వెళ్లడానికి డ్రైన్లపై ఆక్రమణలు పెరగడం ప్రధాన కారణం కాగా బుడమేరుకు గండి పడటం మరో కారణమన్నారు. విజయవాడలోని 62వ డివిజన్‌కు ప్రత్యేక అధికారిగా ఉన్న తాను అక్కడి ప్రజల కష్టాలు అతి చేరువగా గమనించానన్నారు. ప్రధాన డ్రైన్లపై ఆక్రమణల తొలగింపు ప్రారంభించామని, రాబోవు 10 రోజుల్లో డ్రైన్ల మీద ఆక్రమణలను వారే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే జేసీబీల ద్వారా నగరపాలక సంస్థ సిబ్బంది తొలగిస్తారని స్పష్టంచేశారు.

తిరుపతమ్మ చరిత్రపై పుస్తకాలు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని రచయితలు కలిసి తిరుపతమ్మ అమ్మ వారి చరిత్రపై పుస్తకాలు రాయటం సంతోషదాయకమని మాజీ మంత్రి నెట్టెం. రఘు రామ్ అన్నారు. శనివారం ఉదయం ఖమ్మం జిల్లా సుద్దేపల్లికి చెందిన రామదాసు సాహితీ కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో తిరుపతమ్మ అమ్మ వారి చరిత్ర, అమ్మవారి కథనం, సన్నాఫ్ శ్రీకృష్ణ , శివోహం అనే నాలుగు ఆధ్యాత్మిక పుస్తకాలను ఆలయ చైర్మన్. జంగాల. శ్రీనివాసరావు కలిసి ఆవిష్కరించారు. ఇందులో వివిధ రచయితలు కలిసి అమ్మవారి దివ్య చరిత్ర ,మొదేపల్లి సీనమ్మ అమ్మవారి దివ్య కథనం ,ధూత రామ కోటేశ్వరరావు శివోహం సన్నాఫ్ కృష్ణ పుస్తకాలు రాయడం జరిగింది. ముక్కా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు వ్యవస్థాపకుడు మోటార్ నారాయణరావు. సాధనాల వెంకటస్వామి నాయుడు.బి శ్రీనివాస్ గౌరీపతి శాస్త్రి లు పుస్తక విశ్లేషణ చేశారు. తదుపరి అతిథుల చేతుల మీదుగా రచయితలు అందరికీ నెట్టెం.రఘు రామ్. ఆలయ చైర్మన్. శ్రీనివాసరావు చేతుల మీదుగా ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో దూత రామ కోటేశ్వరరావు , వీధి దుర్గారావు, ముక్కా సత్యనారాయణ. మొదేపల్లి శీనమ్మ పాల్గొన్నారు.

స్వగృహాలకు వరద బాధితులు

విశాలాంధ్ర-పెదపారుపూడి : వరద బాధితులను తమ తమ గృహాలకు వెళ్లటానికి తగిన వాహనాలను ఏర్పాటు చేసి తరలించినట్లు తహసీల్దార్ రంగారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 13 రోజుల క్రితం భారీ వర్షాలకు ఎగువ నుండి దిగువకు వరద నీరు మండలంలోని మోపర్రు తదితర గ్రామాలలోని పొలాలు నీట మునిగాయి. అదే విధంగా మోపర్రు గ్రామంలో గృహాలలోకి కూడా వరద నీరు వ్యాపించడంతో ఆ గ్రామస్తులు సుమారు 175 మందిని పునరావాసం కొరకు మండల కేంద్రమైన పెదపారుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో చేర్చడం జరిగింది. తర్వాత వరద నీరు తగ్గటం వలన తహశీల్దార్ వరద బాధితులను తిరిగి వారి గృహాలకు పంపించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఆనంద్ భూపతి, వీఆర్ఏలు సుక్కమ్మ, లక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌గా ఎస్ఈబీ

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : రాష్ట్ర ప్రభుత్వము స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగమును రద్దు చేయడమే కాకుండా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖను 2020 మే ముందున్న రూపానికి పునః నిర్మిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జగ్గయ్యపేట లోని తొర్రగుంట పాలెం నందు గల స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ రద్దు కాబడి దాని స్థానంలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ గా మార్పు దిద్దుకుంది. 2020 మే కి ముందు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏ ఏ విధులు అయితే నిర్వహించారో ఆ విధులను ఇప్పటినుండి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ నిర్వహిస్తుంది. ఇప్పటినుండి జగ్గయ్యపేట ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ ఇతర రాష్ట్రాల నుండి వచ్చే అక్రమ మద్యం, బెల్ట్ షాపులు, నాటు సారాయి, గంజాయి మరియు ఇతర డ్రగ్స్ తదితర నేరాలను నిర్మూలించుట కు కృషి చేయడమే కాకుండా ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన మద్యం షాపులు, బార్లు, కల్లు దుకాణాలు , ఇథనాల్ మరియు మిథనాల్ యూనిట్లు తదితర తదితర ప్రభుత్వ నుంచి లైసెన్స్ పొందిన 74 విభాగాలకు చెందిన అంశాలలో సక్రమంగా నిర్వహణ జరిగే విధంగా పర్యవేక్షించడం తదితర విధులను నిర్వహిస్తుంది. ప్రభుత్వం శుక్రవారం ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం జగ్గయ్యపేట ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ యొక్క పరిధిలో జగ్గయ్యపేట మరియు వత్సవాయి మండలాలు వున్నాయి. ఈ స్టేషన్ 1 ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్ఐలు మరియు ముగ్గురు హెడ్ కానిస్టేబుల్స్, 12 మంది కానిస్టేబుల్స్ తో పనిచేస్తుంది. పట్టణంలో తొర్రగుంటపాలెం నందు ఇప్పటివరకు పని చేస్తున్న స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ స్థానంలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పనిచేస్తుందని జగ్గయ్యపేట ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. పైన తెలిపిన నేరాలకు సంబంధించి ఏ విధమైన సమాచారం ఉన్నను 9440902461 నెంబర్‌కు సమాచారం అందించాలని ఆయన నియోజకవర్గం లోని ప్రజలను కోరారు.

కొనకంచిలో పోషకాహార ఉత్సవాలు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : కొనకంచిలో శనివారం పోషకాహార ఉత్సవాలు నిర్వహించారు. చిల్లకల్లు ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మీ భార్గవి ఆదేశాల మేరకు ఏసి డిపిఓ నాగమణి, సెక్టార్ సూపర్వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు సందర్భంగా కొనకంచి గ్రామంలో ఆవిరితో చేసుకునే వంటకాలు గురించి, వాటి ప్రయోజనాలు ,పోషక ఆహారం గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

తొలగని కష్టాలు ..!

- సింగ్‌నగర్ ఇన్నర్ రింగ్‌రోడ్డులో 11 చోట్ల భారీ గండ్లు
-జలదిగ్బంధంలోనే నందమూరి నగర్ బాధితులు
-నాలుగు రోజులుగా నగరకయాతన
-ఫిర్యాదు చేసినా పట్టించుకొని అధికారులు -స్థానికుల ఆగ్రహం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : భారీ వర్షాలు, వరదలు వీడి వారం రోజులు కావస్తున్నా సింగ్‌నగర్‌లోని నందమూరినగర్ ప్రజలకు మాత్రం మోక్షం కలకపోగా సమస్యలు మరిన్ని పెరిగాయి. వరదల్లో చిక్కుకుని అల్లాడిన జనం బతుకుజీవుడా అంటూ ఇంతర ప్రాంతాలకు వెళ్లి వరద తగ్గుముఖం పట్టటంతో నాలుగు రోజుల క్రితం సొంతిళ్లకు తిరిగివచ్చి అన్నీ చక్కబెట్టుకుంటుండగా జక్కంపూడి వైపుల రోడ్డుకు గండ్లు కొట్టటంతో ఈ ప్రాంత ప్రజలకు బాహ్య ప్రపంచంతో మరలా సంబందాలు తెగిపోయాయి. అర్ధరాత్రి రెండు రోజుల వ్యవధిలో సింగ్‌నగర్ నుంచి జక్కంపూడి, వైఎస్ఆర్‌కాలనీ, మిల్క్‌ప్రాజెక్టు, సితార, కబేళా సెంటర్, భవానీపురం తదితర ప్రాంతాలకు వెళ్లే సింగ్‌నగర్ ఇన్నర్‌బైపాస్ (100 అడుగుల రోడ్డు)లో 11చోట్లు గండ్లు కొట్టి వదిలేశారు. దీంతో వరదలు తగ్గి ఇళ్లకు చేరుకున్న అనేక కుటుంబాలు మరల అష్టదిగ్బంధంలో చిక్కుకుపోయారు. ప్రధాన రహదారికి కొట్టిన గండ్లు కారణంగా కనీసం మనిసి నడకమార్గానైనా బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పండిందని, మొన్న వరద కారణంగా సర్వం కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే మానవ తపిదం వల్ల తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని నందమూరి నగర్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాహ్య ప్రపంచంతో సంబందాలు తెగిపోవటంతో వృద్దులు, కూలీలు, విద్యార్థులు మూడవేదన అనుభవిస్తున్నారు. కనీసం కాలబాటయినా ఏర్పాటు చేయాలని విజయవాడ రూరల్ తహసీల్దార్, ఎంపీడీవోకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

రహదారికి గండ్లు కొట్టటంతో ప్రజల కడగండ్లు

సింగ్‌నగర్ నుంచి జక్కంపూడి వెళ్లే పైపుల రోడ్డుకు 11చోట్లు గండ్లు కొట్టటంతో నందరమూరినగర్ ప్రజలు ఇంకా జలదిగ్బంధంలోనే అల్లాడుతున్నారు. వరద తగ్గిందని ఊపిరిపీల్చుకుంటున్న తరుణంలో కొందరి అనాలోచిత, నిర్లక్ష ఆలోచనతో వరద సమస్యలతో కనీసం కాలిబాటకూడా లేకుండా రోడ్డు మొత్తం ధ్వంసం చేసి వదిలేయటంతో ఈ ప్రాంత ప్రజలు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వరద, వర్షాల నుంచి సింగ్‌నగర్ ప్రజలు బయటపడితే అదే ప్రాంతంలోని నదరమూరి నగర ప్రజలు మాత్రం బాహ్య ప్రపంచటంతో సంబందాలు లేకుండా జీవశ్చవాల్లా బతుకులీడుస్తున్నారు. ప్రజలకు ఏ వస్తువు కావాలన్నా ఈ మార్గనే రాకపోకలు సాగిస్తుంటారు. లక్షలాది మంది వినియోగించే రోడ్డుపై 11 రోట్ల భారీ గండ్లు కొట్టి వదిలేయటంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు రోజులుగా నరకయాతన

జక్కంపూడి పైపుల రోడ్డుకు గండ్లు కొట్టటంతో ఇంట్లో ప్రజలు బయటకు వచ్చేందుకు, బయట ప్రజలు ఇంట్లోకి వెళ్లేందుకు వీలులేక నాలుగు రోజులుగా నందమూరి నగర ప్రజలు నగరక యాతన అనుభవిస్తున్నారు. రహదారికి అనుకుని ఉన్న పలు గృహాల్లో వందలాది మంది కుటుంబాలు నివాసాలుంటున్నారు. రహదారికి పక్కనే ఉన్న సీఎంఆర్ వేణుగానం అపార్టుమెంట్‌లో 40 కుటుంబాలుంటున్నాయి. వీరిలో 60 నుంచి 80 ఏళ్ల వయస్సున్న వృద్దులు, స్కూలు, కళాశాల విద్యాలున్నారు. ఏవస్తువు కావాలన్నా రెండు, మూడు కిలో మీటర్లు దూరం వెళ్లాల్సి ఉంది. కాలిబాటకూడా లేకుండా గండ్లు కొట్టటంతో నిత్యావసర వస్తువులకు, స్కూల్స్, కాలేజీలకు వెళ్లలేకు నరకయాతన అనుభవిస్తున్నామని అపార్టుమెంట్ వాసులు చెబుతున్నారు.

ఘర్షణ, చోరీ ఘటనలపై దర్యాప్తు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో తాజాగా వెలుగుచూసిన ఘర్షణ, చోరీ ఘటనలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కొప్పుల శివ అనే వ్యక్తి, ఎ.కొండూరు రోడ్డులో నివసించే పోలీసుశాఖ ఉద్యోగి దుగ్గిరాల వెంకటేశ్వర రావులు రెడ్డిగూడెం రోడ్డులో ఒకరిపై మరొకరు ఘర్షణకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇరువురి తలలు పగిలి, తీవ్రంగా గాయపడటంతో వారిని వైద్యసేవలకు తరలించారు. స్థానిక ఎస్సీవాడకు చెందిన పల్లిపాం లక్ష్మణుడు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరగ్గా ఈ రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

వరద బాధితులకు ఐటీబీఎఫ్ తెలుగు జవాన్ల విరాళం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ఇండియా, చైనా సరిహద్దుల్లో గస్తీ కాస్తూ దేశ సేవలో ఉన్న జవాన్లు వరద బాధితులు గురించి సాయం చేసేందుకు ముందువచ్చారు. నగరంలోని కొన్ని ప్రాంతాలు వరదలో నీట మునగడంతో ప్రజలు నష్టపోయారు. ఐటీబీపీఎఫ్(ఇండో-టీబిటేన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్) తెలుగు జవాన్లు చలించిపోయి వరద బాధితులకు సాయపడాలని సమాజం పట్ల సేవా భావాన్ని తెలియజేయాలని తమ వంతు సాయంగా ఖమ్మం జిల్లా కూసుమంచికి చెందిన ఏఎస్ఐ హలవత్ నాగేశ్వరరావు రూ.30వేలను జిల్లా సీపీ ఎస్వీ. రాజశేఖర్‌బాబుకు చెక్కు రూపంలో జిల్లా పోలీస్ కమిషనర్ సీఎం సహాయనిధికి అందజేశారు. గొప్ప మనస్సుతో సాయం చేయడానికి ముందుకు వచ్చిన తెలుగు జవాన్లను సీపీ అభినందించారు. ఈవిధంగా సమాజానికి తమ వంతు వీలైనంత సాయం అందించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

పశు గ్రాసం అందజేత

విశాలాంధ్ర-చల్లపల్లి : ఇటీవల వరద ప్రభావంతో గ్రాసం లేక అల్లాడుతున్న మూగ జీవాలను ఆదుకునేదుకు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం పూనుకుంది. అందులో భాగంగా చల్లపల్లి మండలం వక్కలగడ్డ నుండి రూ. 30 వేలు విలువ చేసే వరి గడ్డి ని ఇబ్రహీంపట్నం మండలం కోటికెలపూడి గ్రామనికి శుక్రవారం పంపించారు. ఏపీ రైతు సంఘం పిలుపులో భాగంగా అవనిగడ్డ నియోజకవర్గ నాయకులు తమవంతుగా సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్ర నాథ్ బెనర్జీ, రైతు నాయకులు మల్లుపెద్ది బోసు, కొల్లూరి శ్రీధర్, నక్కా శ్రీనివాసరావు, దాసరి గోపాల కృష్ణ, సాయి రత్న బాబు, లెనిన్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టిప్పర్

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం పట్టణంలోని వెంకటేశ్వర సెంటర్ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. బైకును టిప్పర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరికీ గాయాలు క్షత గోత్రులను చికిత్స నిమిత్తం పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్ కి తరలించారు ప్రమాదంలో గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషయంగా ఉన్నది .క్షతగాత్రులు ఉంగుటూరు మండలం గారపాడు కి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు

నిత్యావసరాల వితరణ

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : వరదతో ఇబ్రహీం పట్నంలోని సెవెంత్ డే పాఠశాల ప్రాంగణం నీటిలో మునిగింది. విజయవాడ హైదరాబాదు లలోని సెవెన్త్ డే బ్రాంచ్ లలో పనిచేస్తున్న యాజమాన్యం, సిబ్బందికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డేవిడ్ మార్కు మాట్లాడుతూ ఆపదలో ఉన్న సమయంలో ఆదుకోవడం గొప్ప విషయమని, మరింత మంది ముందుకు వచ్చి తమను ఆదుకోవాలని కోరారు.

రేపు రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-గన్నవరం : ఈ నెల 16న గన్నవరం రిటైడ్ ఉద్యోగుల భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అవుటపల్లి మోహనరావు తెలిపారు. విజయవాడ వైద్యులు మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు, కృష్ణ సాయి దంతవైద్యశాల డాక్టర్స్ పరీక్షలు నిర్వహిస్తారు. రిటర్డ్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాబురావు కుటుంబానికి సీపీఐ నాయకుల పరామర్శ

విశాలాంధ్ర-గన్నవరం : వీరవల్లి గ్రామానికి చెందిన నందమూరి నాగభూషణం(బాబురావు)(72) గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. ఈ నెల 10వ తేదీన బాబురావు హనుమాన్‌జంక్షన్ బ్యాంక్‌కు పనిమీదగా వెళ్లగా అక్కడ తీవ్రంగా గుండెపోటుతో మృతి చెందాడు. బాబురావు గతంలో రంగన్నగూడెం కో ఆప్ రేటివ్ బ్యాంక్ కార్యదర్శిగా పని చేసారు. ఆయనకు కుమారుడు ప్రసాద్, కుమార్తె హైమ మాధవి, భార్య ఉన్నారు. శనివారం సీపీఐ నాయకులు స్వగృహం వీరవల్లి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గన్నవరం నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, సీపీఐ కార్యవర్గ సభ్యులు ముక్కమాల ఉమామహేశ్వరరావు, కాట్రగడ్డ రామచంద్ర జోషి, మంచికంటి సాంబయ్య, సభ్యులు చాంగంటిపాటి భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ ఆహారాన్ని తీసుకోవాలి

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామాలలో గర్భిణీలు, బాలింతలు, కిషోర్ బాలికలు ఆరోగ్యవంతంగా కొనసాగటానికి సమతుల పోషకాహారాలు గలసాంప్రదాయ పదార్థాలతో రూపొందించినఆహారాన్నితీసుకోవాలని ఏఎన్ఎం కే బుజ్జి సూచించారు, మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్టులో కూచిపూడి సెక్టార్ పరిధిలోని పెదపూడి సచివాలయ అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం పెదపూడదళితవాడ అంగన్వాడి కేంద్రంలో పోషకాహార మాసోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రోటీన్లు అధికంగా ఉన్న ఆకుకూరలు, చిరుధాన్యాలు,పాలు, కోడిగుడ్లతో పాటు రక్తహీనత నివారణకు ఐరన్, క్యాల్షియం ట్యాబ్లెట్లు వాడాలని సూచించారు. కూచిపూడి సెక్టార్ సూపర్వైజర్ ఏ ఎస్ కళ్యాణి పర్యవేక్షణలోజరిగినఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కే జ్యోతిలక్ష్మి, ఎం జ్యోతి, సిహెచ్ నాగమణి, జి పద్మజ, కే వెంకటేశ్వరమ్మ, ఆశా వర్కర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు. పెడసనగల్లులో నిడుమోలు

సెక్టార్ సూపర్వైజర్ అబ్దుల్ సలీమున్నీసా ఆధ్వర్యంలో పోషకాహార మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు, కిషోర్ బాలికలకు పలు సూచనలు ఇస్తూ ప్రీ స్కూల్ పిల్లలతో ర్యాలీ నిర్వహించారు.

CHANGE OF NAME
I, **Natta jyothi**, previously called **Puli Naga Jyothi,** W/o. Prasanna Kumar Natta, D.No. 3-98/1, Kavutaram, Gudlavalleru, Krishna Dist., I have changed my name as **NATTA JYOTHI.**
By
NATTA JYOTHI.

భ్రూణ హత్యలను నివారించాలి : రామకృష్ణయ్య

విశాలాంధ్ర-మచిలీపట్నంటౌన్ : దేశంలో బాలికల సంఖ్య తగ్గుతోందని, లింగ నిర్ధారణ పరీక్షలే కారణమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కె.వి రామ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మచిలీపట్నం గ్రేస్ నర్సింగ్ కాలేజ్ విద్యార్థినిలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, బాలికల శాతాన్ని పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం తీసుకువచ్చిందని, ఈ చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుపరిచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రాష్ట్రంలో 1000 మంది బాలురు ఉంటే 943 మంది బాలికలు ఉన్నారని, కృష్ణాజిల్లాలో వెయ్యి మంది బాలురకు 925 మంది బాలికలు ఉన్నారని, ఈ నిష్పత్తి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో బాలికల సంఖ్య తగ్గిపోతుందని అల్ట్రా సౌండ్ స్కానింగ్ ద్వారా లింగ నిర్ధారణ చేసి ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణ హత్యలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఎయిడ్ ముసలయ్య, లీగల్ కౌన్సిల్ మెంబర్ రహమతున్నిసాబేగం, ఓ ఎస్ సి సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ అర్చిష్మ, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ సరస్వతి,ఐ సి పి ఎస్ సిబ్బంది,ఐ సి డి ఎస్ సిబ్బంది, సఖి వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి కాలనీలో రూ.29లక్షలతో పైప్‌లైన్ నిర్మాణం

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ ప్రగతి పథంలో పయనిస్తుందని, అన్ని రంగాల్లో గుడివాడను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం గుడివాడ రూరల్ మండలం శ్రీకాళహస్తి కాలనీలో రూ.29 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మించనున్న పైప్ లైన్ నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, తజనసేన నాయకులు బురగడ్డ శ్రీకాంత్‌లతో కలిసి ఎమ్మెల్యే

వెనిగండ్ల రాము భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ శ్రీకాళహస్తి కాలనీ ఏర్పడి 23 ఏళ్లు గడిచిన గత పాలకులు ప్రజలకు తాగునీరు ఇవ్వలేకపోయార న్నారు. (15 రోజుల్లో పైప్ లైన్ల నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రమణ్యం, ఎండిఓ వెంకటరమణ, గుడివాడ, రూరల్, నందివాడ మండలాల టిడిపి అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళి, దానేటి సన్యాసిరావు, బిజెపి నాయకులు దావులూరి నరేంద్ర, మున్సిపల్ ఎం.ఇ విజయదుర్గా, డి.ఈ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : వరద బాధితులకు లలితా దేవి చారిట్రబుట్ ట్రస్ట్ సహాయం అందించింది. 7 వ వార్డులోని కట్ట కింద వరద బాధితులకు చల్లపల్లి కి చెందిన లలితాదేవి చారిట్రబుల్ ట్రస్ట్ అధినేత రిటైర్డ్ డిప్యూటీ తహశీల్దార్ ముమ్మారెడ్డి వెంకట కృష్ణారావు 16 కుటుంబాల వారికి 5 వేల రూపాయలు విలువ చేసే దుస్తులు, దుప్పట్లను జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషబాబు చేతుల మీదుగా పంపణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగి అబ్దుల్ మజీజ్, వర్రె రామారావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గోన్నారు. మండల పరిధిలోని దక్షిణచిరువోల్లంక వరద బాధితులకు అవనిగడ్డ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పర్చూరి దుర్గా ప్రసాద్ ఆద్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. శుక్రవారం సాయంత్రం మేడిలంక ఎస్.సి కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ పాల్గోని ప్రారంభించారు. మేడిలంక ఎస్.సి కాలనీ, చిరువోల్లంక ఎస్.సి కాలనీ, వడుగువారిపాలెం ప్రాంతాల్లో 300 మంది వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

సామూహిక కుంకుమ పూజ

విశాలాంధ్ర-కూచిపూడి : స్థానిక 5వ వార్డులోని మిల్లుబజార్లోని వినాయకపందిరిలో కుంకుమ పూజ నిర్వహించారు. విద్యార్థులు విఘ్నేశ్వరుడు, సరస్వతి దేవికి పూజలు నిర్వహించారు. పావులూరి వెంకటేశ్వరరావు(పసి) పర్యవేక్షణలో జరుగుతున్న ఈ వేడుకలలో పూజలు అర్చకులు మొవ్వ రాము నిర్వహిస్తున్నారు. కూచిపూడి అగ్రహారంలో రెండో వార్డులో పసుమర్తి వారి బజారులో అన్నా చెల్లెళ్ళైన ఏలేశ్వరపు వెంకటేశ్వర ఫణి కుమార్, భాగవతుల నాగమణి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పెను మూడి సతీష్‌కుమార్ శర్మఅర్చకత్వంలో సాంప్రదాయ పద్ధతిలో గత ఎనిమిది రోజులుగావినాయకుని విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్నారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వరద బాధితులకు కెసిపి సిమెంట్ ఆధ్వర్యంలో శనివారం పలు వరద ప్రాంతాల్లో దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కె.సి.పి సిమెంట్ సంస్థ సీనియర్ ప్రెసిడెంట్ కె.రామకృష్ణ మాట్లాడుతూ విజయవాడ లో ఈమధ్య సంభవించిన వరదలతో సర్వం కోల్పోయిన వరద బాధితులకు చేయూతగా కెసిపి సిమెంట్ సంస్థల చైర్మన్ ఇందిరా దత్ పిలుపుతో వరద బాధితులకు సహాయం చేయాలని సంకల్పంతో వరద బాధిత ప్రాంతాలలో దుప్పట్లు ,టవల్స్ పంపిణీ చేయటం జరిగింది.ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కెసిపి సిమెంట్ సంస్థ తమ వంతుగా బాధితులకు సహాయం అందిస్తామని రామకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ ఎ.జి.యమ్ హేమంత్ ,సంస్థ ప్రతినిధులు నరేష్, కిరణ్, శివ తదితరులు పాల్గొన్నారు..

ముంపు ప్రాంతాల్లో
పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు ఆ యా పంచాయితీ అధికారులు చేపడుతున్నారు. అధిక వర్షాలు, అధిక వరదలతో గ్రామాలన్నీ నీట ముంపుకు గురైయ్యాయి. శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు ఈఓపిఆర్‌డి కమ్మిలి సుందరి ఆద్వర్యంలో పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు శనివారం అవనిగడ్డ శివారు నదీ పరివాహక ప్రాంతం అయిన వసుమట్లలో సున్నం, బ్లీచింగ్ గ్రామ రహదారులతో పాటు గృహ ఆవరణలోనూ పూర్తిగా చల్లి దోమల నివారణకు ఎబ్బేట్ మందును పిచికారి చేశారు.

దబ్బాకుపల్లిలో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-వత్సవాయి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దబ్బాకుపల్లి గ్రామంలో సైడ్ డ్రైనేజీలలో మట్టి చేరడంతో ఎక్కడికి అక్కడ వర్షపు నీరు రోడ్ల పైన ప్రవహించింది తుఫాను ప్రభావం అనంతరం దబ్బాకుపల్లి గ్రామ సర్పంచ్ గ్రామంలో జెసిబి తో గ్రామంలోని అన్ని మురుగు కాలువల్లో ఉన్న మట్టిని తొలగించారు.

పారిశుధ్య కార్మికుల పనులు నిలిపివేత

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: నెలల తరబడి వేతనాలు చెల్లించటంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం విస్సన్నపేటలో పారిశుధ్య కార్మికులు పని నిలిపివేసి, నిరసన వ్యక్తం చేశారు. విస్సన్నపేట పంచాయతీలో పారిశుధ్య, విద్యుత్ దీపాల మరమ్మత్తుల పనులు చేసే కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదు. ఎప్పటికప్పుడు వాయిదా వేస్తున్న పాలకవర్గం, అధికారులను శు క్రవారం కార్మికులు గట్టిగా నిలదీయగా, వేతనాలు చెల్లించే అవకాశం లేదని తేల్చి చెప్పినట్లు కార్మికులు తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో శనివారం ఉదయం వారు పనులు నిలిపివేసి, గాంధీబొమ్మ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో వేతనాలు అందేలా చొరవ తీసుకుంటామని, పనులు కొనసాగించాలని చేసిన విజ్ఞప్తి మేరకు వారు విధులు చేపట్టారు. ఈలోగా సామాజిక మాధ్యమాల ద్వారా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు సమాచారం అందటంతో ఆయన స్పందించారు. ఆదివారం ఉదయం కార్మికులతో నేరుగా సమావేశమై, వారి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామంటూ సోషల్‌మీడియాలో ప్రకటించారు.

రాజీమార్గమే రాజమార్గం : మెజిస్ట్రేట్ భాస్కరరావు

విశాలాంధ్ర-బంటుమిల్లి :- లోక్ అదాలత్‌తో రాజీపడ్డ కేసులను రాజీచేసుకోవడంతో కక్షిధారులు వారి విలువైన సొమ్ము, సమయం ఆదా చేసుకోవచ్చని బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్, మండల న్యాయ సేవా సాధికార కమిటీ చైర్మన్ ఎం భాస్కర్‌రావు అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం మెగా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. మెజిస్ట్రేట్ భాస్కరరావు మాట్లాడుతూ కక్షిదారులు కక్షలు, కార్పణ్యాలు పోకుండా కోర్టులో రాజీ పడ్డ కేసులను రాజీ చేసుకోవడం ద్వారా వారి విలువైన సొమ్ము, సమయం ఆదా చేసుకునే మార్గం ఉందన్నారు. అలాగే రోజులు తరబడి కోర్టులు చుట్టూ తిరగకుండా అవసరమైన కేసులను రాజీ చేసుకుని ప్రశాంత వాతావరణంలో కక్షిదారులు ఉండవచ్చు అన్నారు. దీనిలో భాగంగా క్రిమినల్ కు సంబంధించి 20 కేసులు, ఎక్సైజ్ మరియు క్రిమినల్ తదితర వాటికి సంబంధించి 77 కేసులు రాజీ అయినట్లు కోర్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు యాళ్ళ సోమశేఖర్ (శ్యాం బాబు), న్యాయవాదులు పళ్లెం వీర వెంకటేశ్వరరావు, తమ్మన సురేష్, పులి పవన్ కుమార్, కొప్పర్తి నాగ ఆంజనేయులు,సుధా బత్తుల సురేష్, మోజాస్, పామర్తి రవి, తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వమండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మొవ్వన్యాయస్థానంలో శనివారం జాతీయ లోక్ నిర్వహిచిన లోక్ అదాలత్‌లో 105 కేసులకు పరిష్కారం లభించింది. న్యాయమూర్తి పి రాజన్ ఉదయ్.ప్రకాష్ పర్యవేక్షణలో పలు కేసులు పరిష్కారం చేశారు. కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో 30, ఘంటసాల 35, చల్లపల్లి 40 కేసులకు సత్వర న్యాయం లభించి నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గొర్రిపర్తి శ్రీనివాసరావు,పోతుల వెంకట శివ శ్రీనివాస్, చల్లపల్లి సి.ఐ పి. ఈశ్వరరావు, ఎస్సైలు పి ప్రతాపరెడ్డి (ఘంటసాల), పి.వీ.ఎస్. ఎస్.సుబ్రహ్మణ్యం(చల్లపల్లి), మూడు స్టేషన్లకోర్టు కానిస్టేబుల్స్, కక్షిదారులు,న్యాయవాదులు, పాల్గొన్నారు

అగ్ని ప్రమాద బాధితులకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కాజాలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఆరు కుటుంబాలకు సిపిఐ పార్టీ నేతలు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. బాధిత కుటుం బాలైన పంచాయతీ పారిశుధ్య కార్మికులు తిరువీధి నాంచారమ్మ, తిరువీధి పోలమ్మ, చలంరామయ్య, ఈగ శేషయ్య మాణికల సుబ్రహ్మణ్యం, యాదగిరి ఏసమ్మ కుటుంబాలకు అందజేసిన వితరణలో సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా చేనేత కార్మిక సంఘ అధ్యక్షులు కోదాటి, నారాయణరావు, సీపీఐ పామర్రు నియోజకవర్గ సహాయ కార్యదర్శి చందోలు నాగేశ్వరరావు మోదుమూడి సద్గుణరావు, చేనేత కార్మికులు కోదాటి కనకదుర్గారావు, నందం వెంకట నరసింహారావు, కోదాటి ఈశ్వర ప్రసాద్, పంచల మోహన్‌రావు, గౌరీ సత్యప్రసాద్, నందం శ్రీనివాసరావులు పాల్గొన్నారు. అంతకు ముందుగా ఉయ్యూరు ఉషా డిజైనర్స్ అధినేతలు ఆలపాటి ఉషారాణి, ఆలపాటి ఝాన్సీ రాణి సహకారంతో నిత్యావసర వస్తువులు, వంట సామాగ్రి, చీరలు కండువాలు దుప్పట్లు, లుంగీలు అందజేశారు ఈ కార్యక్రమంలో జోగి నవ్య, తాడంకి నరేష్ పిల్లి అవినాష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు శీలం నారాయణరావు, పలువురు అనుబంధ సంస్థల సభ్యులు పాల్గొన్నారు

సీతారాం ఏచూరి మరణానికి సంతాపం

విశాలాంధ్ర-తిరువూరు: నింగికి ఎగిరినతార కామ్రేడ్ ఏచూరికి కి సీపీఎం తిరువూరు నియోజకవర్గ సమితి నాయకుడు సీతారాం ఏచూరి మృతికి శనివారం సంతాపం తెలిపారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి చిలుకూరు వెంకటేశ్వర్లు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్, తిరువూరు మండల కార్యదర్శి నృసింహాద్రి వనమాలి, ఏ కొండూరు మండల కార్యదర్శి మేకల డేవిడ్, విసన్నపేట మండల కార్యదర్శి మరస కట్ల త్యాగరాజు, ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఎస్ కె నాగుల్ మీరా, (కార్పెంటర్) ఏచూరికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

ప్రమాద స్థాయిలో గ్రావెల్ తోలకాలు...

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : వరదలతో కొట్టుకు పోయిన రోడ్ల మరమ్మతులకు ట్రిప్పర్లతో ప్రమాద స్థాయిలో తొలకాలు చేస్తున్నారు. ట్రిప్పర్‌లో నుంచి పెద్ద పెద్ద బండ రాళ్లు రోడ్డుపై పడుతున్నాయని, ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. తాజాగా పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్ వద్ద టిప్పర్‌లో నుంచి పెద్ద రాళ్లు రోడ్డు మీద రోడ్డుమీద పడినవి, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అన్నారు. అధికారులు దీనిపై దృష్టి పెట్టి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ప్రజలకోరుకుంటున్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-మంగళగిరి : ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురైన వరద బాధితులకు మంగళగిరి చెందిన ఆరేకటిక రాష్ట్ర సంఘం మాజీ అధ్యక్షులు కె.శివరాం బాబాజీ లక్ష రూపాయల చెక్కును మంత్రి నారా లోకేష్‌కు శుక్రవారం రాత్రి అందజేశారు. గణేష్ విగ్రహాలను సందర్శించడానికి మంగళగిరి వచ్చిన సందర్భంగా శివరాం బాబాజీ లోకేష్‌ను కలిసి చెక్కును అందజేశారు. దాతకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

18న జూడో, ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఎస్‌జీఎఫ్ జూడో, ఫుట్‌బాల్ అండర్-17, 14 బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు ఈ నెల 18వ తేదిన జరుగుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ మెల్లంపూడి రవి ఒక ప్రకటనలో తెలిపారు. జూడో ఎంపికలు చిలకలూరిపేట ఎంజి హైస్కూల్‌లో, ఫుట్‌బాల్ ఎంపికలు నరసరావుపేట కోడెల శివప్రసాద్ రావు స్టేడియంలో జరుగుతాయని వివరించారు. ఎంపికలకు వచ్చేవారు తమ ఎంట్రీఫారమ్, డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ని తీసుకుని తప్పనిసరిగా ఉదయం 9 గంటలకు ఆయా గ్రౌండ్లలో సిద్ధంగా ఉండాలని అన్నారు.

రెండు కేసుల మద్యం స్వాధీనం

విశాలాంధ్ర-మంగళగిరి : తుళ్లూరు మండలం అనంత వరంలో తెలంగాణ మద్యం అమ్మకాలు జరుగుతున్నా యని వచ్చిన సమాచారం మేరకు మంగళగిరి సెబ్ అధికారులు, సిబ్బంది శనివారం దాడులు నిర్వహించి రెండు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులను స్వాధీనం చేసుకొని కె.శివకుమారి, కట్లగుంట నరేష్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశారు. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఉత్తర్వుల మేరకు జిల్లా డీఎస్‌ఈవో సెబ్ ఎం.వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా ఇఎస్ రంగా రెడ్డి, ఏ.కృష్ణ కిషోర్ ఆదేశాల మేరకు మంగళగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది పాల్గొని ముద్దాయి లను అదుపులోకి తీసుకున్నారు. సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు లోపాలను సరిచేయాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఉపాధ్యాయుల సర్దుబాటులో లోపాలను సరిచేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్దుబాటు ప్రక్రియలో జరిగిన లోపాలని సరిచేయాలని ఎస్టీయూ డిమాండ్ చేస్తుందని అన్నారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న స్కూల్స్‌కి విద్యార్థులు లేని స్కూల్స్ నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడానికి ఆన్‌లైన్ నమోదు, ఆన్‌లైన్ సర్దుబాటు వల్ల అనేక సమస్యలు వచ్చాయని అన్నారు. ప్రతి సంవత్సరం జరిగే ప్రక్రియను జఠిలం చేశారని అన్నారు. సర్దుబాటు ప్రక్రియ అంతా అస్తవ్యస్తంగా ఉందని అన్నారు. కొంతమంది ఉపాధ్యాయులు రిలీవ్ అవ్వలేదని, కొంతమంది కోరుకున్న స్కూల్‌లో చేరి మరలా వారి యథాస్థానానికి వెళ్లారని అన్నారు. ఇప్పటికైనా లోపాలు సరిచేసి విద్యార్థుల సంఖ్యను బట్టి

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఎస్టీయూ పక్షాన కోరుతున్నామని అన్నారు. పల్నాడు జిల్లాలో సర్దుబాటు జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, మేనేజ్‌మెంట్ వారీగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయలేదని అన్నారు. జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో మున్సిపల్ స్కూల్స్ ఖాళీలు భర్తీ చేశారు. మున్సిపల్ పాఠశాలలో వెంటనే ప్రమోషన్స్ కోసం షెడ్యూల్ ప్రకటించి ప్రమోషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఎస్టీయూ డిమాండ్ చేస్తుందని అన్నారు. మునిసిపాలిటీలలో సర్దుబాటులో ప్రస్తుతం మునిసిపాలిటీలలో ఉన్న మెరిట్ సీనియారిటీ జాబితా ద్వారా చేశారని అన్నారు. ఆ జాబితాల స్థానంలో, మెరిట్ కం రోస్టర్ సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసి, ఆ తర్వాత మాత్రమే పదోన్నతులు కల్పించాలని కోరారు. మున్సిపాలిటీలలో కూడా సర్దుబాటులో లోపాలు ఉన్నాయని అంటున్నారు జీవో 84 వల్ల ఉపయోగం లేనప్పుడు ఆ జీవో రద్దు చేసి మున్సిపల్ స్కూల్‌కి అర్బన్ ఎంఈఓను నియమించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వకుండా జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో నింపడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయులు కొరత ఉన్న పాఠశాలల్లో ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన రేషనలైజేషన్ చేసి పోస్టులు మంజూరు చేయాలని ఎస్టీయూ డిమాండ్ చేస్తుందని అన్నారు. పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వడ్లాన జయప్రకాష్, షేక్ జమీర్ బాషా, షేక్ ఫరిశా, ఎస్.కాలేషా, ఐ.అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

'నిజమైన ప్రేమ ఎవరిది' చిత్ర పూజా కార్యక్రమంలో డాక్టర్ షమ సుల్తాన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మెగా మూవీ అండ్ అసోసియేషన్ ఎస్ఎస్ విజ్ఞాన కృష్ణ బ్యానర్‌లో వస్తున్న 'నిజమైన ప్రేమ ఎవరిది' నూతన చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు శుక్రవారం గుంటూరు నగరంలోని నగరంపాలెంలో వైభవంగా జరిగాయి. హెూప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తాన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర యూనిట్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. మెగా మూవీ అసోసియేషన్ అధినేత ఎన్ఎస్ నాయుడు ఈ చిత్రానికి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పఠాన్ మస్తాన్, ప్రొడ్యూసర్ బి. గోపి, కెమెరామెన్ అనిల్ కుమార్, హర్షవర్ధన్, హీరోయిన్స్ పుష్ప, అఖిలారెడ్డి, నటులు ఎన్ఎస్ నాయుడు, ఎస్ఎస్ లక్ష్మీ, అరుణ, హరిని, చేబ్రోలు భాషా, యోగి, బీజేపీ లక్ష్మీ, అంజలి, రమ్య, హరినా, రేఖా, షారిఫా, జై కుమార్, నరసింహ చౌదరి, సుందరరావు, హెూప్ విన్ హాస్పిటల్స్ మేనేజర్ పి. నాగేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం మరింత పెరగాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రజలలో భక్తిభావం మరింత పెరగాలని టీడీపీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. నగరంలోని పాతగుంటూరు, సీతారంనగర్, శ్రీనగర్, అన్నపూర్ణ నగర్‌లలో జరుగుతున్న గణపతి ఉత్సవాలలో భాగంగా జరిగిన అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా వినాయక చవితి ఉత్సవాలు చేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాయన్నారు. నిమజ్జనం సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గణపతి ఉత్సవాల కమిటీ నిర్వాహకులు డేగల ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు.

బాధితులకు దుప్పట్లు, చాపలు పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : విజయవాడలోని రామానుజన్ కాలనీ, వాంబే కాలనీలో వరద ముంపునకు గురైన వరద బాధితులకు స్కోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతలు మాల కొండయ్య, కంచర్ల శ్రీహరి, విద్యాసాగర్, ఆయిల్ రెడ్డిల సహకారంతో ఏజీ కార్యాలయ ఆడిటర్ విద్యాసాగర్, అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజర్ కంచర్ల శ్రీహరి చాపలు, దుప్పట్లు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ మాతో కలిసి చదువుకున్న స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ డి. కొండలరావు స్కోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేయడం తమకెంతో సంతోషాన్ని ఇస్తుందని ప్రశంసించారు. కరోనా విలయతాండవం చేస్తున్న సందర్భంలో కూడా అనాథలు, అభాగ్యులకు భోజనం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. విజయవాడ వరద ముంపుకు గురైన వారికి దుప్పట్లు, చాపలు అందజేయటం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. కంచర్ల శ్రీహరి మాట్లాడుతూ వరద ముంపునకు గురైన వారు తమ ఆరోగ్యం పట్ల ఎక్కువ శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంటి, నరసింహం, అంగన్వాడీ టీచర్ రాణి, సూపర్వైజర్, వరద బాధితులు పాల్గొన్నారు.

చంటి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-నందిగామ: గత ఐదు రోజుల క్రితం నందిగామ పెద్ద మునేరులో కొట్టుకుపోయిన మాడుగుల చంటి అనే యువకుని మృతదేహం కొటికలపూడి వాగు వద్ద శనివారం లభ్యమైంది. నందిగామ పట్టణ సిఐ వైవీఎల్ నాయు డు చొరవతో రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేసి మృతదేహం కోసం వెతుకులాడగ ఈ రోజున కొటికలపూడి వాగు వద్ద మృతదేహాన్ని కనుగొన్నారు.

అమర మహిళా కళాకారుల సంస్మరణ సభ

విశాలాంధ్ర-తెనాలి : గాంధీనగర్ ఇస్లాఫ్ హాలులో శనివారం అమర కళాకారులు సరోజని, రాజమ్మ, సౌమిత్రిల సంస్మరణ సభ జరిగింది. ఆడవారు బయటకు రాని రోజుల్లో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎదిరించి ప్రజానాట్య మండలి, కమ్యూనిస్టు పార్టీలో ఉత్సాహంగా చేరి గ్రామ గ్రామాన ప్రజా చైతన్య ప్రదర్శనలిచ్చిన అమర మహిళా కళాకారిణిలు వీరమాచినేని సరోజని, తాపీ రాజమ్మ, సౌమిత్రిలు చిరస్మరణీయులని సినీ ఆర్టిస్ట్ (డబ్బింగ్) వాల్మీకి విజయలక్ష్మి నివాళులర్పించారు. అధ్యక్షత వహించిన విజయలక్ష్మి సరోజని గురించి మాట్లాడుతూ ప్రజా ప్రదర్శనలు మాభూమి, అపనింద, నాటకాల్లో రక్తకన్నీరు నాగభూషణం, మిక్కిలినేని వాళ్ళతో నటించారన్నారు. నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, పి.సి. జోషి, చంద్ర రాజేశ్వరరావుల ప్రశంసలనందుకున్నారన్నారు. అందరూ స్త్రీలతో మాతా పిక్చర్స్ స్థాపించి మహానటి సావిత్రి దర్శకత్వంలో చిన్నారిపాపలు సినిమా నిర్మించారన్నారు. ఆ చిత్రం అంతర్జాతీయంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ విజేతను చేసిందన్నారు.

డైరెక్టర్ విక్టరీ మధుసూదనరావుతో కమ్యూనిస్టు పార్టీ వారే పెండ్లిచేశారన్నారు. ఆనాడు గ్రామాల్లో మహిళా సంఘాలను స్థాపించి కోలాటం, జానపద నృత్యాలు, నాటికలు ప్రదర్శించి ప్రజా చైతన్యం కోసం ఆమె కృషి చేసిందన్నారు. పి.సి.జోషి, రాజేశ్వరరావులు ముద్దుగా పిలిచేవారని చెప్పారు. పట్టుదలకు మారుపేరు సరోజిని అన్నారు. విజయవాడ రామటాకీస్‌లో అపనింద నాటకం ప్రదర్శించగా విశేషంగా జనం ప్రదర్శన చూసి ఆమెను అభినందించారని చెప్పారు. మహిళా దళాలను తయారు చేసి సామాజిక పోరాటాల్లో మహిళా ఉద్యమాల్లో మమేకమయ్యారని చెప్పారు. పార్టీ నిషేధకాలంలో చెన్నై చేరి అక్కడ కూడా మహిళా సమాఖ్య, ప్రజానాట్యమండలి శాఖలు ఏర్పాటు చేశారన్నారు. నాటకం, నాటికలు కూడా రచించి మద్రాసులో ప్రదర్శనలిచ్చారని జీవితాంతం ప్రజా నాట్యమండలి కార్యకర్తగా సేవలందించా రని, వారి బాటలో నేటి మహిళలు ముందుకు సాగాలని చెప్పారు. గాయకురాలు వీణ మాట్లా డుతూ నటుడు ఎన్టిరామారావు రాయలసీమ కరువు బాధితుల సహాయార్థం ఏర్పాటు చేసిన యాత్రలో పాల్గొంటూ ఆమె కుమార్తె చావు బ్రతుకుల్లో ఉన్నా బంధువుల వద్ద విడిచి యాత్రలో కొనసాగారని ఆమె ఉదారతను ఎన్టిఆర్ సభల్లో చెప్పేవారని చెప్పారు. కొడేపూడి రాధ, తాపీ రాజమ్మలు వంతలుగా బుర్రకథ చెప్పి వాణి మహల్‌లో అవార్డులు రివార్డులు పొందారన్నారు. మౌనిక సౌమిత్రిని గురించి మాట్లాడుతూ విశాలాంధ్ర దినపత్రికలో పనిచేస్తూ రాత్రి సమయంలో గ్రామాలలో మహిళా నాయక గాయక దళాలను తయారు చేశారని, రాష్ట్రమంతటా ప్రజానాట్యమండలి కార్యక్రమాల్లో పాల్గొనేవారని ఆమెకు నివాళు లర్పించారు. గాయకురాలు అనూరాధ మాట్లాడుతూ సరోజిని, సౌమిత్రి, తాపి రాజమ్మలు తుది శ్వాస వరకు కమ్యూనిజం బలోపేతానికి కృషి చేశారని వారి బాటలో నేటి ప్రజానాట్య మండలి మరింత కృషి చేయాలని వారికి జోహార్లర్పించారు. కార్యక్రమంలో విజయదుర్గ, యోజ్ఞ సహస్ర, శ్రీరాం, బొల్లిముంత కృష్ణ, చందు సూర్య తదితరులు పాల్గొన్నారు.

LOST OF DOCUMENT

నేను,కొమ్మినేని కొండయ్య,తం॥శ్రీ.వెంకటేశ్వర రావు వయస్సు: 63సం॥లు,ప్రస్తుతనివాసం: వైకుంఠపురం గ్రామం, అమరావతి(మం), పల్నాడు జిల్లా.

On solemn oath and affirmation state as under. My original Registered Sale Deed No.350/1990, Dt.16.07.1990 pertaining in D.No.8-AB2C an extent of Ac.3.53 cents and Regd. Sale Deed No.351/1990,Dt.16.07.1990 pertaining in D.No.7 an extent of Ac.0.94 cents situated in Vykuntapuram(V), Amaravathi(Md), Palnadu Dt., which was registered on the file of SRO, Amaravathi executed in favor of me have been lost by me while I was going to Amaravathi(V), from Vykuntapuram by bus on 15.06.2024. I am also declaring that I am liable to conviction if any malpractice/ misappropriation found against me. If it is traced in future I shall submit it to the SRO, Amaravathi.

మహారాజశ్రీ 7th అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి ఒంగోలు వారి కోర్టులో

I.A.628|22 in A.S.114/2022

బత్తుల ధనలక్ష్మి -- అప్పిలెంట్

V/s

మల్లాది శ్రీనివాసరావు & ఇతరులు

-- రెస్పాండెంట్స్

1) మల్లాది విజయకుమారి, తండ్రి దక్షిణామూర్తి (లేటు) బ్యాంకు ఎంప్లాయి, R/o డెల్లా రోడ్డు నెం.12, చిక్కడపల్లి, హైదరాబాద్

2) గొల్లపూడి ఇందిర, భర్త వెంకట శేషగిరిరావు (లేటు) R/o 2వ లైన్, వేణుగోపాల్‌నగర్, ఎన్.జి.ఓ.కాలనీ, గుంటూరు

3) లంక లక్ష్మీతులసి, భర్త ఎల్.బి.శ్రీనివాస్ మియాపూర్, హైదరాబాద్

పై నెంబరు A.S. 114/22 అప్పీల్‌లో రెస్పాండెంట్స్ అయిన R5, R6, R8 వార్లకు నోటీసులు జారీ కానందున శ్రీ కోర్టువారు మీ నోటీసులు నిమిత్తమై పేపరు ద్వారా ప్రకటనకు ఉత్తర్వులు జారీచేసి ఉన్నారు. తేది : **19-09-2024**న పై తెల్పిన కోర్టునందు **ఉదయం 10.30** ని॥లకు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కావలసినది. అట్లుకాని యెడల పై అప్పీలు మీపై పరోక్షమున తీర్మానించబడును.

కోలా శివప్రసాద్, అడ్వకేట్

ఒంగోలు, సెల్ : 98492 40010

108 వాహనాల డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-దాచేపల్లి : పల్నాడు జిల్లాలోని 108 వాహనాల్లో డ్రైవర్(పైలెట్లు) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మేనేజర్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, 35 ఏళ్ళ వయసు లోపు అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేయాలని కోరారు. నరసరావుపేటలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న 108 కార్యాలయంలో ఈ నెల 15 లోపు దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 80962 42990 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఆలయానికి 10 కిలోల వెండి అందజేత

విశాలాంధ్ర-దాచేపల్లి : స్థానిక సంఘోద్ధారక అవార్డు గ్రహీత దివంగత దేవరశెట్టి బాలాంజనేయులు కుమారుడు రోజా నాగేశ్వరరావు కుటుంబీకులు శనివారం శ్రీవీర్ల అంకమ్మ తల్లి ఆలయానికి రూ.10 లక్షల ఖరీదు చేసే 10 కిలోల వెండిని బహుకరించారు. అమ్మవారికి మకర తోరణం చేయించేందుకు భక్తులు ఈ వెండిని ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులకు అందజేశారు. రానున్న విజయ దశమి పండగ నాటికి ఆభరణాన్ని చేయించి దేవీ నవరాత్రుల్లో అమ్మవారికి అలంకరించను న్నారు. తొలుత ఆలయంలో అమ్మవారికి దేవరశెట్టి కుటుంబీకులు ప్రత్యేక పూజలు చేశారు.

గణేష్ విగ్రహం వద్ద అన్నదానం

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : గణేష్ నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక డౌన్ మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో నెలకొల్పిన వినాయకస్వామి విగ్రహం వద్ద శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకుడు ఉమ్మడి అప్పారావు ఆధ్వర్యంలో 1000 మంది భక్తులకు అన్నదానం చేపట్టారు. సోమవారం నిమజ్జనం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యుడు ఉమ్మడి కృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయపురిసౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు, మైలపల్లి అప్పలరాజు, హుస్సేన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనం సందర్భంగా అన్నదానం

విశాలాంధ్ర-అమరావతి : మండల పరిధిలోని పొందుగల గ్రామంలో శనివారం వినాయకుని నిమజ్జన కార్యక్రమంలో భాగంగా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుని పురవీధుల్లో ఊరేగించి పవిత్ర కృష్ణా నదిలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి భవిరిశెట్టి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన తాళాల భజన

విశాలాంధ్ర, తెనాలి : తెనాలి నాజరుపేట గురవయ్య కాలనీలో వినాయక నవరాత్రుల సందర్భంగా శనివారం జరిగిన భజన పాటలు ప్రేక్షకులను అలరించాయి. చందు చంద్రమౌళి సేవా కళాసంఘం ఆధ్వర్యంలో జరిగింది. భజన మాస్టారు రెడ్డి ఉమామహేశ్వరరావు సారధ్యంలో ఎ.రమేష్, విజయ్, బైరాగి, మధుదేవి, అనిత, వాణి, శారద, నాగజ్యోతి, సూర్య మృదుమధురంగా గానం చేశారు. గణేష్ ఫ్రెండ్ సర్కిల్ పర్యవేక్షణల గాయక బృందాన్ని సత్కరించారు.

400 బస్సులు కొనుగోలు ఘనత తమ ప్రభుత్వానిదే: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఆర్టీసీకి 400 కొత్తబస్సులు కొన్న ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందని టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. కొత్తబస్సులతో పాటు బస్టాండ్ల ఆధునీకరణపై కూడా దృష్టి పెట్టి ప్రజారవాణాకు కొత్తరూపు కల్పిస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. వినుకొండ ఆర్టీసీ డిపోను అన్ని హంగులతో ఆధునికంగా తీర్చిదిద్దబోతున్నామన్నారు. డిపో పరిధిలో రెండు కొత్త బస్సులను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్టీసీలో నూతన శకం ప్రారంభమైందని అందుకు తగినట్లే ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. సీతారాంపురం తండాకు బస్సు సర్వీసును ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అయిబ్ ఖాన్, పత్తి పూర్ణచంద్రరావు, పెమ్మసాని నాగేశ్వరరావు, సౌదాగర్ జానీ భాష, చికెన్ బాబు, గోల్డ్ కరీముల్లా, బోడెపూడి రామారావు, పలు ఆర్టీసీ అధికారులు సుగుణ, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి. సాంబశివరావు , వివిధ యూనియన్ ల నాయకులు పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌కు సత్కారం

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ మున్సిపల్ కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్‌ను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఘనంగా సత్కరించారు. విజయవాడలో వరద విపత్తుపై బాధితులను ఆదుకునేందుకు సహాయక చర్యలు చేపట్టేందుకు కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌ను విజయవాడ పంపారు. వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టినందుకు 12 రోజులు నిరంతరం శ్రమించినందుకు ఆయనను జీవీ అభినందిస్తూ శనివారం వినుకొండలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు.

మంచికల్లులో వివాదం

విశాలాంధ్ర-రెంటచింతల : మంచికల్లులో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వివాదాలు చోటుకుంటున్నాయి. శనివారం మేకపోతుల మౌనిక తన ఇంటిని శుభ్రం చేసుకునేందుకు మాచర్ల నుంచి వచ్చింది. ఈ వ్యవహారం నచ్చని ప్రత్యర్థి పార్టీకి చెందిన ఆరుగురు దూషణకు పాల్పడినట్లు ఇంటికి తాళం వేసి స్థానిక పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు పరిశీలిస్తున్నట్లు స్థానిక ఎస్సై నాగార్జున తెలిపారు.

అవార్డు గ్రహీత రామకృష్ణకు సన్మానం

విశాలాంధ్ర-మాచర్ల : కిడ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జీవీఎన్ రామకృష్ణ శాస్త్రి విజయవాడ వైవీ రావు సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆడిటోరియం ఆవరణలో శనివారం ఏపీ ఎంఈడీ ప్రాస్పరిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రధానోత్సవంలో డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ దేవానంద రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా దేవానంద రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు మారుతున్న విద్యా ప్రణాళికలకు అనుగుణంగా వారి నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో విద్యాభ్యాసం చేసేలా వారికి స్కిల్స్ పెంచుకునేలా విజయ బోధన చేయాలన్నారు. అవార్డు గ్రహీత రామకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు. పెద్దలు దేవానంద రెడ్డి సూచనల ప్రకారం బోధించి ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వెలగపూడి ఇందిరా దత్తు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మాచర్ల : కేసీపీ సంస్థల చైర్‌పర్సన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వెలగపూడి ఇందిరా దత్తు జన్మదిన వేడుకలు స్థానిక కేసీపీ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫ్యాక్టరీ ఆవరణలోని విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కేసీపీ సంస్థల ఫౌండర్ చైర్మన్ వెలగపూడి రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వెలగపూడి లక్ష్మణ దత్తు విగ్రహాలకు నివాళులర్పించి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఫ్యాక్టరీ జీఎం వెంకటరమణ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో కూడిన సిమెంట్‌ను ప్రజలకు అందించడం కేసీపీ సంస్థలకే సాధ్యమవుతుందన్నారు. పట్టణం, పరిసర గ్రామాలకు కేసీపీ సంస్థ ద్వారా మంచినీటిని అందించడంతోపాటు ఏటా హెల్త్ క్యాంపులు నిర్వహించటం జరుగుతుందన్నారు. అంతేకాకుండా సంస్థ ద్వారా ప్రభుత్వ వైద్యశాలతోపాటు పలు పాఠశాలలకు కుర్చీలు, బెంచీలు వంటి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిడ్స్ పాఠశాలలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. అదేవిధంగా రమేష్ హాస్పిటల్స్ గుంటూరు వారి సౌజన్యంతో మెడికల్ క్యాంపును నిర్వహించడం జరిగిందని, ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులకు విందు భోజనాలతో పాటు, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో పలువురు పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మికులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్టీసీ బస్సులో గంజాయి పట్టివేత

విశాలాంధ్ర-దాచేపల్లి : పొందుగల సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన గురించి దాచేపల్లి సీఐ గుత్తి వెంకట్రావు శనివారం విలేకర్లకు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి నెల్లూరుకు తెలంగాణకు చెందిన ఆర్టీసీ బస్సు వస్తోంది. ముందస్తు సమాచారం మేరకు దాచేపల్లి పోలీసు అధికారులు అక్కడికి వెళ్లారు. బస్సు రాగానే ఆపి తనిఖీ చేశారు. అందులో ప్రయాణం చేస్తున్న కోమలపాటి షారుక్ కుమార్ వద్ద ఉన్న బ్యాగును అనుమానంతో తీసి చూడగా గంజాయి ప్యాకెట్లను గుర్తించారు. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని 1.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బీఎస్సీ అగ్రికల్చర్ మూడో సంవత్సరం చదువుతున్న 24ఏళ్ల వయసు కలిగిన ఈ నిందితుడు గంజాయికి అలవాటు పడ్డాడు. దాంతో హైదరాబాద్‌లోని పఠాన్ చెరువు ప్రాంతానికి చెందిన కొంతమందితో అతనికి స్నేహం ఏర్పడింది. వారి నుంచి తరచూ ఈ గంజాయిని తెచ్చుకునేవాడు. ఈ నేపధ్యంలోనే అక్కడి నుంచి గంజాయిని తాజాగా తెచ్చుకుంటూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ వెంకట్రావు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్సై శివ నాగరాజుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పోషకవిలువలు

విశాలాంధ్ర - కారంపూడి : చిరుధాన్యాలు తీసుకోవడం వలన శరీరానికి పోషక విలువలు అమితంగా అందుతాయని అంగన్‌వాడి సూపర్‌వైజర్ వై.ఉమాదేవి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా శనివారం గాదెవారిపల్లె గ్రామంలో చిరుధాన్యాల ఆవశ్యకతను ఆమె వివరిస్తు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు గల చిరుధాన్యాలు సజ్జలు, జొన్నలు, వేరుశనగ, పెసలు మొలకెత్తినవి తినడం వలన ఆరోగ్యానికి మేలన్నారు. ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్, గ్రుడ్లు, పాలు, బెల్లం, అటుకులు తినడం ద్వారా రక్తహీనతను నిరోధించుకోవచ్చని ఆమె తెలిపారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాల బారిన పడకుండా ఉండవచ్చని ఆమె తెలియచేశారు. కార్యక్రమంలో గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించారు.

నిందితులను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర- పెద కూరపాడు : లగడపాడులో అక్రమ కేసులను నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం ఎదురు ఎస్సీలు రోడ్డుపై శనివారం నిరసన తెలియజేశారు. పల్నాడు జిల్లా దళిత జై భీమ సంఘం నాయకులు కృష్ణ మాట్లాడుతూ గత వారంలో వినాయకుడి విగ్రహం ఊరేగింపు కాలనీ వైపు వచ్చి వివాదాలకు దారి తీసిన వైనంలో దోషులను పోలీసులు అరెస్టు చేయలేదని, అక్రమంగా 17 మంది ఎస్సీలపై తప్పుడు కేసులు పెట్టడంపై మండిపడ్డారు. నిందితులను అరెస్టు చేయాలంటూ నిరసన తెలిపారు. దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేస్తామని ఎస్సై బాల నాయక్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించుకున్నారు. స్థానిక దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉప ఖజానా కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-పెదకూరపాడు : నూతనంగా నిర్మించనున్న పెదకూరపాడు ఉప ఖజానా(సబ్ ట్రెజరీ) కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శనివారం భూమి పూజ చేశారు. రూ.1.08 కోట్ల వ్యయంతో మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉప ఖజానా కార్యాలయ నూతన భవనాన్ని నిర్మించనున్నారు. నూతనంగా నిర్మించనున్న భవనానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరంగా ఉందన్నారు. టీడీపీ మండల కార్యదర్శి అత్తిమల రమేష్, బెల్లంకొండ రామ్ గోపాల్, భాష్యం ఆంజనేయులు, గల్లా బాబురావు, మాజీ ఎంపీటీసీ ఎస్కే ముంతాజ్, వడ్లమూడి అప్పా రావు, సర్పంచ్ గుడిపూడి రాజు, మక్కెన సాగర్ పాల్గొన్నారు.

యరపతినేనిపై కేసు కొట్టివేత

విశాలాంధ్ర-రెంటచింతల : గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుపై ఉన్న కేసు శనివారం గురజాల కోర్టులో కొట్టివేశారు. 2020 అక్టోబరు 23న అప్పటి మాజీ ఎమ్మెల్యే యరపతినేని రెంటచింతలలో పర్యటించారు. టీడీపీ నేత బోయిన సర్వయ్య మృతికి సంతాపం వెలిబుచ్చారు. సమావేశంలో పోలీసుల మానసిక స్థైర్యం దెబ్బతినేలా వ్యాఖ్యలు చేశారని స్థానిక కానిస్టేబుల్ ఇమ్మడిశెట్టి పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు గురజాల మాజీ ఎమ్మెల్యేతో పాటు మరో 49 మంది టీడీపీ నేతలపై ఎస్సై చల్లా సురేష్ కేసు నమోదు చేశారు. శనివారం గురజాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్ కేసు కొట్టివేసినట్లు ఎస్సై నాగార్జున వెల్లడించారు.

పీబీఎన్‌లో హిందీ దినోత్సవం

విశాలాంధ్ర-పొన్నూరు: దేశవ్యాప్తంగా ప్రాభవాన్ని చాటేందుకు హిందీ భాష ఎంతో అవసరమని పీబీఎన్ కళాశాల హిందీ విభాగాధిపతి జె.రూయి దాస్ పేర్కొన్నారు. నిడుబ్రోలు పీబీఎన్ కళాశాలలో జాతీయ హిందీ దినోత్సవం కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీకాంత్ అధ్యక్షతన శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రూయి దాస్ మాట్లాడుతూ దేవనాగరి లిపి నుంచి ఉద్భవించిన హిందీ భాష ఎంతో మధురమైనదని ప్రపంచ భాషలలో హిందీ భాషకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని ఆయన పేర్కొన్నారు. హిందీ భాషలో ఎందరో కవులు, మేధావులు, రచయితలు తమ రచనల ద్వారా భాషాభివృద్ధికి తోడ్పాటు అందించారని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా అధిక రాష్ట్రాలలో ప్రాచుర్యంలో ఉన్న హిందీ భాష మన భారతదేశ జాతీయ భాషగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నదని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.చిత్తరంజన్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి జి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిత్ర గీతాలాపన

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: ప్రణవి మ్యూజికల్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై ఉపముఖ్యమంత్రి, సినీ హీరో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకొని జరిగిన సినీ సంగీత విభావరి ఆద్యంతం శ్రోతలను పరవశింప చేస్తూ జరిగింది. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కారుమంచి రాజు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. భారతి, లక్ష్మీ తులసి, సింధు, కుసుమాంజలి, మల్లీశ్వరి, బి ఆర్ సుశీల్ కుమార్, బీఎస్ఎన్ఎల్ శ్రీనివాసరావు, శివశర్మ, లక్ష్మీనాయక్, రమణబాబు తదితరులు జరమొచ్చింది సలు పొచ్చింది, అల్లాటప్పా గోంగూరమ్మ, చిట్టి నడుమునే చూస్తున్నా అమ్మాయే సన్నగా, రెడ్ రెడ్ బుగ్గే రెడ్ వంటి పలు చిత్రాలలోని పాటలను ఆహూతులను హుషారెక్కిస్తూ పాడి వినిపించారు.

చిరస్మరణీయుడు సీతారాం ఏచూరి: సీపీఐ, సీపీఎం

విశాలాంధ్ర-తాడేపల్లి: సీపీఎం కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిరస్మరణీయుడు అని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సీపీఐ తాడేపల్లి మండల సమితి నాయకులు కంచర్ల కాశయ్య అన్నారు. శుక్రవారం రాత్రి ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ కార్యక్రమం సీపీఎం తాడేపల్లి మండల నాయకులు నల్లపు కిషోర్ బాబు అధ్యక్షతన జరిగింది. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి, కంచర్ల కాశయ్యలు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి మార్క్సిజాన్ని అధ్యయనం చేశారని అన్నారు. సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి, ఉన్నత విద్యను అభ్యసించిన సీతారాం మతోన్మాద శక్తులను వెనక్కికొట్టేందుకు, తాడిత పీడిత ప్రజల విముక్తి కోసం మార్క్సిజం అధ్యాయం చేసి, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని అన్నారు. సీపీఎం వడ్డేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శి గుడిసె శ్రీనివాసరావు, అమ్మిశెట్టి రామారావు, సహాయ కార్యదర్శి ఎస్‌కే గన్, సీనియర్ నాయకులు గుంపెన వెంకటేశ్వరరావు, కారసాల స్వాతి, గుడిసె ప్రభుకుమార్, బిరుదుగడ్డ ఏలియా, శౌరి పాల్గొన్నారు.

ప్రకాష్ నగర్ సెంటర్‌లో: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరికి తాడేపల్లి ప్రకాష్ నగర్ సెంటర్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు వేముల దుర్గారావు, శౌరి బర్లులం, నీరుడు దుర్గారావు, దర్శి చిన దుర్గారావు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్ట్

విశాలాంధ్ర-మంగళగిరి: ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్సై సిహెచ్ వెంకట్ హెచ్చరించారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన గాడిదపాటి రాజు అనే వ్యక్తి అపార్ట్‌మెంట్‌లకు వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఫిర్యాది ఆత్మకూరు గ్రామంలో ఒక అపార్ట్‌మెంట్‌కు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సమయంలో ఆత్మకూరు గ్రామానికి చెందిన తాటి రూపేంద్ర ప్రభు అనే వ్యక్తి తన కూతుర్ని వెంబడించి ప్రేమించమని ఇబ్బందిపెట్టినట్లు, వేధిస్తున్నట్లు ఈ విషయం ఫిర్యాదికి తెలిసి గతంలోనే ముద్దాయిని మందలించారు. అయితే ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ముద్దాయి తన మోటార్ సైకిల్‌పై వెళ్లి మైనర్ బాలికను బలవంతంగా తన బండిపై ఎక్కించుకుని కిడ్నాప్ చేసినట్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి 24 గంటల్లోనే ముద్దాయిని అరెస్ట్ చేశారు. సదరు ముద్దాయికి గతంలో గంజాయి, లిక్కర్ కేసులు ఉన్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు. ఫిర్యాది ఇచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ ఎస్సై వెంకటేశ్వర్లు కేసును త్వరితగతముగా పూర్తిచేసి ముద్దాయిని కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ సురేష్ ముద్దాయికి 14 రోజులు రిమాండ్ విధించారు.

వరద బాధితులకు సహాయం

విశాలాంధ్ర-తెనాలి: శ్రీశైల భక్త సేవాసమితి, తెనాలి వారు శనివారం వరదలు కారణంగా దెబ్బతిన్న లంక గ్రామాలు ఆవులవారిపాలెం, ఈపూరులంక, ములకపల్లి లంక, కొత్తూరు లంక, అన్నవరపులంక, కనిగిరిలంక ప్రజలకు సుమారు పది వేల బిర్యాని ప్యాకెట్లు, మంచినీరు అందించారు. ఆహారం లేక ఇబ్బంది పడుతున్న పశువులకు మినపపొట్టు బస్తా, కామధేను మిక్సర్ బస్తా, బెల్లం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు ఆళ్ల వెంకట సుబ్బయ్య, పరిమి గోవర్ధన్, కోన బ్రహ్మానందగుప్త, కొడాలి భారతి, వెంపటి రవీంద్ర, తుమ్మల రామకృష్ణ, నక్కా వేణుగోపాల్, బి.భాస్కర్, దావులూరి భారతి తదితరులు పాల్గొన్నారు.

చిన్న దోమ పెనుప్రమాదం

విశాలాంధ్ర-తెనాలి: చినరావూరు, చెంచుపేటలలో డెంగ్యూ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ తెలిపారు. దోమలు ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్త వహించాలని, డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలు అవలంభించవలసిన చర్యల గురించి ప్రజలకు వివరించారు. డెంగ్యూ దోమ మంచినీటి నిల్వలలో గుడ్లను పెట్టి వాటి సంతతిని అభివృద్ధి చేసుకుంటుందని, కావున ఇంటి లోపల ఉండే గృహోపకరణాలైన ఫ్రిజ్ వెనుక భాగాన, కూలర్లలో, వాడని రుబ్బురోలు, పనికిరాని ప్లాస్టిక్ సామాన్లు, టైర్లు, కొబ్బరి బోండాలు, మూతలు లేని ఓవర్ హెడ్ ట్యాంకులు, నీళ్ల ఇంకని పూల కుండీలు, తదితర నీటి నిల్వలను ప్రతి వారమునకు కనీసము ఒకసారి తప్పక తొలగించాలని, ప్రజలు దోమతెరలు వాడాలని, పూర్తి వస్త్రధారణ ధరించాలని వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ దాసరి నాగమల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్స్ షేక్ నవీద్, షేక్ రషీద్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి కె.మేరీజోష్ఫిన్, అనిత, ఆషా కార్యకర్తలు నాగమ్మ, అరుణ, లీలావతిబాయ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు మెప్మా చేయూత

విశాలాంధ్ర-విజయవాడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ముంపునకు గురై నష్టపోయిన బాధితులకు మెప్మా, అర్బన్ కంపెనీ సంయుక్తంగా పలు సేవలు అందిస్తున్నట్లు మెప్మా డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. ముంపు బాధితులకు అందించే సేవలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో డైరెక్టర్ తేజ్ భరత్ మెప్మా ఆర్పీలు, యూడీసీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వరద ముంపు ప్రాంతాల ప్రజలకు సేవలందించేందుకు సింగ్ నగర్, వాంబే కాలనీ, భవానీపురం, పాయకాపురం, కండ్రిక రాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి మెప్మా, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుసంధానంతో అర్బన్ కంపెనీ యాప్ ద్వారా వివిధ సేవలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

పద్మశాలి అసోసియేషన్ తృతీయ వార్షికోత్సవం

విశాలాంధ్ర-తెనాలి: పద్మశాలి ఎంప్లాయిస్ వెల్‌ఫేర్ అసోసియేషన్ తృతీయ వార్షికోత్సవం తెనాలి కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు జి.వి.యస్.రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మాజీ యం.ఎస్.సి. ఎ.యస్. రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలలో వచ్చిన మార్పులకు అనుగుణంగా చేనేత రంగంలో కూడా సాంకేతికతను అన్వయించుకొని కొత్త తరహా వస్త్రాలను ప్రజలకు అందించాలని కోరారు. మాజీ ఆప్కోచైర్మన్ చిరంజీవి మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగుల ఐక్యతే సమస్యలకు పరిష్కారమని తెలిపారు. ఉద్యోగుల, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారములో తాను పూర్తిగా సహకరిస్తానని తెలిపారు. గౌరవ అతిథి జి.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవ సమాజానికి వస్త్రాన్ని అందించి, నాగరికతను నేర్పిన చేనేతలు సమాజంలో గుర్తింపు పొందారని, వారి జీవనం మెరుగుదలకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కె.వి.వి. సత్యనారాయణ, కోశాధికారి టి.చంద్రశేఖర్, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, మహిళా విభాగం వారు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అనేక ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గుంటూరు నగరంలోని కొత్తపేట, ఓల్డ్ క్లబ్ రోడ్, రైలుపేట, పొత్తూరి వారి తోట, గుంటూరు వారి తోట తదితర ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో డ్రైన్లపై ఆక్రమణల వలన ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారన్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలో ఓల్డ్ క్లబ్ రోడ్‌లో డ్రైన్ పై పూర్తిగా ఆక్రమణలు జరిగి, మురుగుపారుదలకు వీలు లేకుండా ఉందన్నారు. పూడిక తీయడానికి కూడా ర్యాంప్‌లు, ఆక్రమణలు ఉన్నాయని, తక్షణం వాటిని జేసీబీలతో తొలగించడం జరుగుతుందన్నారు. శనివారం సాయంత్రానికి ఓల్డ్ క్లబ్ రోడ్ రెండువైపులా డ్రైన్‌పై ర్యాంప్‌లు, ఆక్రమణలు తొలగించాలని ప్రజారోగ్య, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించామన్నారు. నగరంలో ప్రాంతాల వారీగా మేజర్ డ్రైన్లపై ఆక్రమణల తొలగింపుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పర్యటనలో తూర్పు ఎంహెచ్‌ఓ(ఇన్‌చార్జ్) రామారావు, డీఈఈ రాము, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

దావా సమన్లు

IN THE COURT OF THE HON'BLE V ADDL. DIST. JUDGE :: GUNTUR

O.S. No. 16 / 2017

Between:
Syed Ershad Ahmed and 3 Others ...Plaintiffs
And
Noorjahan Begum and 11 others ...Defendants
To:
D-2: Abdul Rafi, S/o. Abdul Salam, R/o. 17-23-17/4, Railway Colony, RCM School Street, Vijayawada, Krishna Dist.
D-4: Abdul Razak, S/o. Mohammad Yakub,
D-5: Abdul Rizwan, S/o. Mohammad Yakub,
D-6: Abdul Irfan, S/o. Mohammad Yakub, D-4 to D-6 are R/o.2nd line, Hussain Nagar, Near Andhra Muslim College, Ponnur Road, Guntur.
D-7: Abdul Rahman, S/o. Mohammad Yakub, R/o. D.No.17-8-51, 5th line, Anandpet, Guntur.

పై నెంబరు దావాను వాదులు డిక్లరేషన్ మరియు ఇతర ప్రయోజనముల కొరకు వేయగా అందులో ప్రతివాదులైన 1 నుండి 7వ వార్లు వారి తరుపున శ్రీ కడియాల శ్రీరాములు అను వకీలు గారి ద్వారా వారి సమాధానము దాఖలుచేసి ఉన్నారు. ఇప్పుడు విచారణ సందర్భంగా సదరు వకీలు గారికి నోటీసు ఇవ్వబోతే ప్రతివాదులైన 1 నుండి 7 వారలు వారి వద్ద నుండి ఫైలు తీసుకున్నట్లుగా చెప్పియున్నారు. ఆ దరిమిలా శ్రీ కోర్టు వారు ప్రతివాదులైన 1 నుండి 7 వారలకు ఆర్.పి ద్వారా వారి అడ్రసులకు నోటీసు/ సమన్లు పంపగా అవి రిటన్ అయి ఉన్నవి. కావున శ్రీ కోర్టు వారు ప్రతివాదులైన 1నుండి 7 వార్లకు ఈ పేపర్ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, సదరు దావా విచారణ నిమిత్తము **ది.30-09-2024**కి వాయిదా ఉన్నది. కావున వాయిదా రోజున **ఉ.గం.10-30ని.**లకు ప్రతివాదులైన 1నుండి 7 వార్లు వారి ఆక్షేపణలు తెలుపుకొనుటకు స్వయంగా గాని లేదా వకీలు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై తెలుపగలరు. లేనిచో శ్రీ కోర్టు వారు దావాను చట్ట పరిధిలో తీర్మానం చేయగలరని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వాయిదా తేది:30-09-2024

యమ్. అహమ్మద్ షరీఫ్, వాదులు తరపు న్యాయవాది,
రైలు పేట, సెల్: 9394152228

మహారాజశ్రీ గురజాల సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.A. No. 205/2018, in E.P. No. 35/2014, in O.S. No.119/2010

బిట్వీన్ :
దేరంగుల నరసింహారావు అండ్ ...పిటీషనర్ /డి.హెచ్.ఆర్
మరియు
దేరంగుల మల్లిఖార్జునరావు మరియు 3 గ్గర ఇతరులు ...రెస్పాండెంట్స్/జె.డి.ఆర్స్
టు:
జె.డి.ఆర్.2: దేరంగుల రాధాకృష్ణ, తండ్రి. గురుస్వామి, వయస్సు 52 సం॥లు వ్యవసాయం, సాకిన్ దాచేపల్లి(గ్రా &మం), పల్నాడు జిల్లా.
జె.డి.అర్.4: దేరంగుల ధనలక్ష్మి, భర్త. యాలాద్రి. వయస్సు 44 సం॥లు, గృహిణి. సాకిన్ దాచేపల్లి గ్రామం, దాచేపల్లి మండలం, పల్నాడు జిల్లా.

పైనెంబరు E.P.లో పిటీనర్/డి.హెచ్.ఆర్ E.A. No.205/2018, పిటిషన్‌ను జె.డి.ఆర్స్ 2 & 4 మీద ఉన్న డిస్మిస్డ్ ఫర్ డీపాల్టు ఆర్డర్‌ను రద్దు చేయించి E.P.No.35/2014ను పునరుద్ధరించ వలసినదిగా కోరుచు పిటిషన్ దాఖలుచేసి యున్నారు. సదరు డి.హెచ్.ఆర్.దాఖలు E.A.No. 205/2018 పీటిషన్లో మీకు అనేక పర్యాయములు నోటిసులు పంపించినను మీరు సదరు E.A. & E.P. పెండింగ్ పిషయము తెలిసియుండి కూడా, ఉద్దేశ్యపూర్వకంగా నోటిసు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున. పై కోర్టు వారు జె.డి.ఆర్ 2 & 4 అయిన మీకు ఇందు విషయమై పత్రిక ప్రకటన ద్వారా తెలియ పరచపమని ఆదేశించియున్నందున తెలియపరచటమైనది. మీ హాజరు నిమిత్తం సదరు E.A.No.205/2018, E.P.No.35/2014 **ది.04-10-2024**వ తేదికి వాయిద అయివున్నది. ఆ రోజు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి యెదుట హాజరు అయి మీకుగల ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల మీ పరోక్షమందు కేసును విచారించి తీర్మానించెదరు అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా తేది: 04-10-2024

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

కనకం ఆదినారాయణ, B.L M.A., B.L.,
న్యాయవాది, గురజాల. సెల్: 9885135746

విశాలాంధ్ర
ఆదివారం 15 సెప్టెంబరు | 2024

సికింద్రాబాద్ రైళ్లు పెదకూరపాడులో ఆపాలని వినతి

విశాలాంధ్ర-పెద కూరపాడు : రేపల్లె-సికింద్రా బాద్ పాస్ట్ పాసిం జర్, పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పెదకూరపాడు రైల్వే స్టేషన్‌లో స్టాప్ కల్పించాలని స్థానికులు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్‌కు వినతిపత్రాన్ని శనివారం అందించినట్లు అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ తెలిపారు. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు, మాజీ ఎంపీపీ గల్లా బాబు రావు, భాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ ఎస్‌కే ముంతాజు, సర్పంచ్ జి.రాజు, తెలుగుదేశం నాయకులు అర్తిమళ్ళ రమేష్, బెల్లంకొండ రామగోపాలరావు, భాష్యం, ఆంజనేయులు, వడ్లమూడి అప్పారావు, మక్కెన సాగర్, రత్నబాబు వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఉన్నారు. తనవంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే ప్రవీణ్ హామీ ఇచ్చినట్లు శరచ్చంద్ర తెలియజేశారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-చిలక లూరిపేట : నిరు ద్యోగుల సమస్య లను పరిష్కరించా లని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుబాని, రాష్ట్ర పౌర సరఫ రాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే క్రమంలో గన్నవరం విమానశ్రమంలో మంత్రిని కలసిన సుభాని నిరుద్యోగుల పలు సమస్యలపై మంత్రితో చర్చించారు. ఈ విషయమై మంత్రి నాదెండ్ల మనోహర్ సమస్యను సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు.

స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా గుంటూరు నరసింహారావు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఉమ్మడి గుంటూరు జిల్లా జూనియర్ కళాశాలల వ్యాయామ ఉపాధ్యా యుల సర్వసభ్య సమావేశం డీవీఈఓ పద్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి గుంటూరు జిల్లా యు-19 స్కూల్ గేమ్స్ నూతన కార్యదర్శిగా గుంటూరు నరసింహారావు, సహాయ కార్యదర్శిగా సీహెచ్ పద్మాకర్‌లను నియమించారు. వీరికి వ్యాయామ అధ్యాపకులు ఎస్.సుధాకర్ రెడ్డి, ఎస్‌కే మస్తాన్ వలి, రాజు, మురళీకృష్ణ, శివరామకృష్ణ, ఆదిశేషు, రాజశేఖర్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

కౌలు చెల్లింపునకు నిధులు కేటాయింపుపై హర్షం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు పెండింగ్‌లో ఉన్న వార్షిక కౌలును చెల్లించాలని నిర్ణయించిన ప్రభుత్వానికి రాజధాని అమరావతి ఐక్యకార్యాచరణ సమితి ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపింది. రైతులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపింది. కౌలు నిమిత్తం ప్రభుత్వం ఓటాన్ ఎకౌంట్‌లో కేటాయించిన బడ్జెట్ రూ.400 కోట్ల నిధులను సీఆర్డీఏకి విడుదల చేస్తూ ఆదేశాలిచ్చిన ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసింది. కౌలు రైతులకు ఉన్న బకాయిలు సైతం ప్రభుత్వం వీలైనంత త్వరలో విడుదల చేయాలని రాజధాని అమరావతి జేఏసీ సభ్యులు, అమరావతి రాజధాని రైతు సమీకరణ సమాఖ్య అధ్యక్షులు మాదల శ్రీనివాసు కోరారు.

మెకానిక్‌లు, నిర్మాణ రంగ కార్మికులకు అండగా ఉంటాం: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: మెకానిక్‌లు, నిర్మాణరంగ కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉండి వారికి గౌరవ జీవితం అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని, అందులో తమవంతు సాయం ఉండడం ఎంతో సంతృప్తినిచ్చే విషయంగా భావిస్తానన్నారు. వినుకొండ ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం పెద్దసంఖ్యలో బైక్ మెకానిక్‌లకు టూల్ కిట్లు పంపిణీ చేశారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు చెందిన 120 మంది బైక్ మెకానిక్‌లకు 120 టూల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా పాల్గొని టూల్ కిట్లు అందించారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే జీవీ విజయవాడలో వరద ఉధృతికి వేలాది వాహనాలు దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతులు చేయడానికి మెకానిక్‌లు సరిపోవడం లేదని, ఇలాంటి తరుణంలో నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అక్కడకు వెళ్లి బైక్‌లకు ఉచిత మరమ్మతులు చేస్తామనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు దేశం కూటమి ప్రభుత్వం వచ్చిన 3 నెలల్లోనే సీఎం చంద్ర బాబును అడిగి వినుకొండ ఘాట్ రోడ్ నుంచి షాదీఖానా, తిత్తిదే కల్యాణ మండపానికి రూ.3 కోట్లు, రామలింగేశ్వర స్వామి గుడి నిర్మాణానికి రూ.2 కోట్లు సాధించుకోవడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికీ ప్రతిరోజూ మంచినీరు ఇవ్వాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇల్లు ఇస్తామని, రాష్ట్రంతో పాటు వినుకొండలో ఇల్లులేని పేదలు ఉండకూడదన్నదే సీఎం చంద్ర బాబు, తన సంకల్పమని వెల్లడించారు. అలానే తెదేపా ప్రభుత్వం వచ్చిన తర్వాత గంజాయి, గుట్కాను పూర్తిగా నియంత్రిం చాలని పోలీస్ శాఖకు ఆదేశాలిచ్చారని, యువత వ్యసనాల బారిన పడకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్తులో ఆటోనగర్‌కు సాయం చేస్తామని, ప్రభుత్వ స్థలం దొరికినప్పుడు ఆటోనగర్ ఫేజ్-2ను కూడా పరిశీలనలోకి తీసుకుంటామని చెప్పారు. నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గతంలో తమకు ఇచ్చిన మాట ప్రకారం టూల్ కిట్లు పంపిణీ చేసి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట నిలబెట్టుకున్నారని, అందుకు ఆయనకు రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి షమీంఖాన్ ,పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పఠాన్ అయిబ్ ఖాన్, టీడీపీ నాయకులు పత్తి పూర్ణచంద్రరావు గోల్డ్ కరిముల్లా, చికెన్ బాబు, అజీజ్, అక్బర్ బాషా, జనసేన పార్టీ నాయకులు యూసఫ్ బైక్ మెకానిక్ యూనియన్లు, పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణ దాతలు కండి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షించవచ్చని జేకేసీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, జేకేసీ కళాశాల సంయుక్తంగా శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మురళీమోహన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన 70 మంది విద్యార్థినీ, విద్యార్థులను మురళీమోహన్ అభినందించారు. అనంతరం జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ వైద్యులు డాక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల లోపు వయసున్న వారు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చని, ఈ అంశం పట్ల ప్రజలలో ఉన్న అపోహలను రక్త దానం చేసిన విద్యార్థినీ, విద్యార్థులు తొల గించాలని కోరారు. ఈ రక్త దాన శిబిరంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన దాతలకు కార్యక్రమ నిర్వాహకుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. జేకేసీ కళాశాల ప్రిన్సిపల్ ఐ. నాగేశ్వరరావు రక్తదానం చేసిన విద్యార్థినీ, విద్యార్థులకు పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐ. ప్రసాద్, మానవత ప్రెసిడెంట్ కొమ్మలపాటి శ్రీనివాసరావు, సెక్రటరీ కె. సతీష్, రక్తదాన కమిటీ చైర్మన్ గురవారెడ్డి, బివిఎన్ మిత్ర, ఎన్. సాంబ శివరావు, వర్రె సుబ్రహ్మణ్యం, సిహెచ్ శివాజీ, సాయి కిరణ్, హరి, మేకల రామారావు, టి. ధనుంజయ రెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ ఇన్చార్జి వి. రాహుల్, చరణ్, అజయ్ బాబు, కళాశాల, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు సరకులు పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి : మంత్రి నారా లోకేష్, బోండా ఉమ స్ఫూర్తితో మారుతి ఫౌండేషన్ చైర్మన్ జంగాల సాంబశివ రావు, సింగరాయకొండకు చెందిన టీడీపీ నాయకులు కుర్రా సుబ్బారావు, కుర్రా మధు బాబుల సంయుక్త సహకారంతో రూ.1.50 లక్షల విలువగల నిత్యావసర సరుకులను 150 మంది వరద బాధితులకు శనివారం తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్, బోండా ఉమా సమక్షంలో వారి కార్యాలయానికి వెళ్లి స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జంగాల వెంకటేష్ మాట్లాడుతూ మారుతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్య క్రమాలు విరివిగా చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ముంపుకు గురైన బాధితులకు మారుతి ఫౌండేషన్ చైర్మన్ జంగాల సాంబశివరావు రూ.1 లక్ష, సింగరాయకొండకు చెందిన టీడీపీ నాయకులు కుర్రా సుబ్బారావు, కుర్రా మధు బాబులు రూ.50 వేలు ఆర్థిక సహకారంతో 150 బ్యాగులతో కూడిన నిత్యావసర సరకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. లింగంశెట్టి కిషోర్ కుమార్, అడపా నరేష్, నక్కా నవీన్ రాజా, సిగిరిశెట్టి లీలా కృష్ణ, వెంకట్రావు, బాలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అమరావతి : శైవ క్షేత్రాలలో అగ్రగ్రా మిగా వెలుగొందు తున్న శ్రీ బాల చాముండిక సమేత అమరేశ్వర స్వామి వార్లకు శనివారం సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనా రాయణ, గుంటూరు మాజీ మేయర్ నాగరాజులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివార్లను సేవించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణ అధికారి వేమూరి గోపి ఆలయ మర్యాదలతో సత్కరించారు. స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భవిరిశెట్టి వెంకటేశ్వర్లు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సులువైన సరళ భాష 'హిందీ'

విశాలాంధ్ర- గుంటూరు : భారతీయ భాషలన్నిం టికీ అనుసంధా నమైన 'హిందీ' భాషను విద్యార్థులందరూ అభ్యసించడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ప్రజ్ఞ విద్యాసంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ నాయుడు చక్ర నాగ్ పేర్కొన్నారు. స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ విద్యాసంస్థలలో హిందీ దివస్ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చక్రనాగ్ మాట్లాడుతూ మాతృభాష తెలుగుతోపాటు అంతర్జాతీయ అనుసంధాన భాష ఇంగ్లీషుతో పాటు హిందీపై పట్టు సాధించాలని తద్వారా జాతీయంగా అన్ని రాష్ట్రాల భాషలతో పరిచయం ఏర్పడుతుందని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం రూ.10 లక్షల విరాళం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఇటీవల సంభవించిన వరదల కారణంగా సర్వం కోల్పోయిన విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు గుంటూరుకు చెందిన ప్రముఖ ఆడిటర్ చుండూరి మధుసూదనరావు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.10 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు సహృదయంతో ముందుకొచ్చిన మధుసూదనరావును అభినందించారు.

మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వైసీపీ నేతలు

విశాలాంధ్ర-మంగళగిరి : టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైసీపీ నేతలు తలశిల రఘురాం, దేవినేని అవినాష్, లేళ్ళ అప్పిరెడ్డిలు శనివారం మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌కు విచారణకు హాజరయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ఇప్పటికే పలువురిని కోర్టుకు హాజరుపరచగా వారికి రిమాండ్ విధించిన విషయం విధితమే. పలువురు వైసీపీ నేతలు ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించగా విచారణకు హాజరై పాస్‌పోర్టును పోలీసు వారికి అప్పగించాలని కోర్టు తీర్పు ఇవ్వడం జరిగింది. దానిలో భాగంగా వైసీపీ నేతలు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు రాగా పోలీసులు వారిని విచారించారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణను కొనసాగించారు. అనంతరం వైసీపీ నేతలు దేవినేని అవినాష్, తలశిల రఘురాం, లేళ్ళ అప్పిరెడ్డిలను పోలీసులు ఒకే కారులో బయటకు పంపించారు. మీడియాతో మాట్లాడినవ్వకుండా పోలీసులు ఆంక్షలు విధించడంతో వారు వెళ్ళిపోయారు. న్యాయవాది శర్మ మీడియాతో మాట్లాడుతూ పోలీసులు అడిగిన ప్రశ్నలనే అడుగుతూ సమయం వృథా చేస్తున్నారని, విచారణ పేరుతో పిలిచి వారిని మానసిక శోభకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటిపై దాడి కేసులో వైసీపీ మాజీ మంత్రి జోగి రమేష్‌ను మరోసారి పోలీసులు విచారణకు పిలిపించారు.

సామ్‌సంగ్ టీవీ ప్లస్ ఛానల్ సేవల విస్తరణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో సామ్‌సంగ్ బ్రాండ్ ఉచిత యాడ్ సపోర్టెడ్ స్ట్రీమింగ్ టీవీ (ఫాస్ట్) సర్వీస్ అయిన సామ్‌సంగ్ టీవీ ప్లస్ తన పోర్ట్‌ఫోలియోలో నాలుగు కొత్త ఛానెల్‌లను ప్రారంభించడానికి ఇండియా టీవీ గ్రూప్‌తో జతకట్టింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఇండియా టీవీ గ్రూప్ కనెక్టెడ్ టీవీ (సీటీవీ) ప్రత్యేక ఛానెల్‌లు ఇండియా టీవీ, ఇండియా టీవీ స్పీడ్ న్యూస్, ఇండియా టీవీ ఆప్ కి అదాలత్, ఇండియా టీవీ యోగా ఇప్పుడు సామ్‌సంగ్ టీవీ ప్లస్ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులో ఉన్నాయి. వీక్షకులు ఇప్పుడు వార్తలు, కరెంట్ అఫైర్స్, ఫిట్‌నెస్, వినోదం నుండి విస్తృతమైన అధిక నాణ్యత కంటెంట్ ఆఫర్‌లకు సులభంగా వీక్షించి ఆస్వాదించవచ్చు. సామ్‌సంగ్ టీవీ ప్లస్ వీక్షకులకు 100 కంటే ఎక్కువ లైవ్ టీవీ ఛానెల్‌లు, వేలకొద్దీ చలనచిత్రాలు, షోలకు లైవ్, ఆన్ డిమాండ్ రెండింటికీ యాక్సెస్ కల్పిస్తోంది.

న్యూస్" ఆధ్వర్యంలో నాయి బ్రాహ్మణులకు వృత్తి పరికరాలు పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ నగరంలో వరదల కారణంగా సెలూన్ షాపులు పూర్తిగా నీట మునిగి వృత్తి పరికరాలు కోల్పోయిన పేద వృత్తిదారులకు "న్యూస్" (నాయి బ్రాహ్మణ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సర్వీసెస్) అవసరమైన పనిముట్లు అందచేసింది . స్థానిక కొత్తపేటలో ఉన్న నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎం రవీంద్రనాథ్ బాబు మాట్లాడుతూ విపత్తు నుండి బయటపడి సాధారణ జీవితం కొనసాగించాలంటే వృత్తి పరికరాలు చాలా అవసరమని , అందుకే దాదాపు లక్షన్నర రూపాయల వ్యయంతో 120 మంది నాయి బ్రాహ్మణ వృత్తిదారులకు పరికరాలు అందజేసినట్లు తెలిపారు. నష్టపోయిన వృత్తిదారులకు రెండు కత్తెరలు రెండు కత్తులు ఒక ట్రిమ్మింగ్ మిషన్ తో పాటుగా రెండు దువ్వెనలు , షేవింగ్ క్రీమ్ వంటి పరికరాలను అందజేశారు . మెడికల్ ఎంప్లాయిమెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ మునుగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితులకు అద్భుతంగా సేవలు అందిస్తోందని ,ప్రభుత్వ సేవలకు తోడుగా న్యూస్ సంస్థ వృత్తి పరికరాలు అందించటం వల్ల దైనందిన జీవితం మరల ప్రారంభం అవుతుందని అన్నారు . ఈ కార్యక్రమంలో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్కాపురం కనకారావు , అన్నవరపు బ్రహ్మయ్య , న్యూస్ కోశాధికారి జి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యూస్ సభ్యులు అందిస్తున్న ఆర్థిక సహాయంతోనే సేవా కార్యక్రమాలు నిర్వహించగలుగుతున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు కొమ్మవరకు భాను ప్రసాద్ , ఏసీబీ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మున్నంగి నాగరాజు , సంక్షేమ సంఘం పూర్తి విభాగం కన్వీనర్ రాయవరపు గణపతి , కనకదుర్గ నాయి బ్రాహ్మణ క్షౌరవృత్తిదారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు డి రాము , నవిరి మహేష్ , నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ప్రొహిబిషన్ ఎక్సైంజ్ శాఖ

విశాలాంధ్ర-గుడివాడ : స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరోను రద్దుచేసి, మళ్ళీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైంజ్‌లో విలీనం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు శనివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైంజ్ స్టేషన్‌లోని సిబ్బంది పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సి.ఐ రామోహ్మనరావు, ఎస్.ఐలు మధుబాబు, కరుణప్రియా, సిబ్బంది, పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా 'విజయ హైస్కూల్'

రూ.5లక్షలు విరాళం సేకరించి అందించిన విద్యార్థులు

విశాలాంధ్ర-చల్లపల్లి : వరద బాధితులను ఆదుకోవడంలో విజయ హైస్కూల్ అగ్రగామిగా నిలిచిందని స్థానిక శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం సాయంత్రం చల్లపల్లిలోని విజయ అకాడమీలో అవనిగడ్డ నియోజకవర్గంలోని లంక, ద్వీప గ్రామాల వరద బాధితులను ఆదుకోవడం కోసం విజయ హైస్కూల్ విద్యార్థులు సమీకరించిన రూ.ఐదు లక్షలు విరాళాన్ని ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు చేతులమీదుగా ఎమ్మెల్యే బుద్ధప్రసాదుకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిట్టి చేతుల గట్టి సహాయం స్ఫూర్తిదాయకమన్నారు. బాధలో ఉన్న వారిని ఆదుకోవాలనే మానవత్వం చిన్న వయసులోనే విద్యార్థులలో కలిగించేందుకు ఈ విరాళాల సేకరణ కార్యక్రమం చక్కని వేదికగా నిలిచిందన్నారు. సంస్థ చైర్మన్, ఎన్నారై గొర్రెపాటి రంగనాధబాబు ప్రతి ఏటా కోట్లాది రూపాయలు వెచ్చించి పేద విద్యార్థులకు, రైతులకు అందిస్తున్న సహాయంతో స్ఫూర్తి అందుకున్న విజయ అకాడమీ విద్యార్థులు వరద బాధితుల కోసం రూ.ఐదు లక్షలు సేకరించటం ముదావహం అన్నారు. విద్యార్థులను గొప్ప మానవత్వం ఉన్న వారిగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా అత్యధికముగా విరాళాలు సేకరించిన చిన్నారులు మూడో తరగతి తుమ్మల గౌతమ్ 5,180, ఒకటో తరగతి విద్యార్థి గుమ్మడి జోవిత రూ.5,311 సేకరించగా వారిని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమారావు, ఎంపీపీ కోట విజయ రాధిక, ఎంఈఓ పీ.వెంకటేశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, గొర్రెపాటి ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశ రాజభాష - హిందీభాష : కొమ్మారెడ్డి కిషోర్

విశాలాంధ్ర-బంటుమిల్లి :- హిందీ మన జాతీయ మరియు రాజభాష అని ,ప్రపంచ వ్యాప్తంగా ఏంతో మందికి జీవనోపాదిగా మరిందని కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ అన్నారు .శనివారం స్థానిక కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ ఆవరణలో జాతీయ హిందీ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా విద్యార్థిని ,విద్యార్థులకు హిందీ భాషపై వకృత్వ పోటిలు ,చిత్రలేఖన పోటీలు ,నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను కిషోర్ అందజేశారు .విద్యార్థులు హిందీ కవులు ,కవయిత్రిల వేషధారణలతో మరియు హిందీ పాటలు ,కవితలతో అందరిని అలరించారు .అనంతరం కిషోర్ మాట్లడుతూ ప్రతి విద్యార్థి హిందీని శ్రద్దగా నేర్చుకుని హిందీలో ప్రావీణ్యతను సాధించి దేశ ,విదేశాలలో ఉద్యోగ అవకశాలు అందిపుచ్చుకోవాలన్నారు .అలాగె ప్రతిఒక్కరికి హిందీ భాషా దినోత్సవ శుభాకంక్షాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ కె ఎస్ వి జి శోభ ,ప్రధానోపాధ్యాయులు ఎన్ శ్రీనివాసరావు ,హిందీ ఉపాద్యాయులు ఎస్ చంద్రశేఖర్ ,వి ఏడుకొండలు ,కె మాలతీ ,ఎస్ మాలతీ కుమారి ,సిహెచ్ భగవతి ,విద్యార్థిని విద్యార్థులు పాల్గోన్నారు.

వరదల్లో నష్టపోయిన వ్యాపారుల దరఖాస్తులు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఇటీవల ఉమ్మడి కృష్ణాజిల్లా, ప్రత్యేకించి విజయవాడలోని 32 డివిజన్లలో వరదల వల్ల నష్టపోయిన వర్తకులు, వ్యాపారులు, కిరాణా దుకాణాలు, చిరు వ్యాపారుల నుంచి విజయవాడ చాంబర్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు గద్దం బాల వెంకట రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారులకు జరిగిన నష్టంపై ముఖ్యమంత్రికి నివేదిక ఇచ్చి సాయం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. తన నేతృత్వంలో చాంబర్ ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ శ్రీకాంత్,చాంబర్ మేనేజర్ వంకాయలపాటి కామేశ్వరరావు దరఖాస్తులు స్వీకరించగా సుమారు 300 మందికి పైగా వ్యాపారులు తమకు జరిగిన నష్టం వివరాలను ఫొటోలతో సహా దరఖాస్తు రూపంలో చాంబర్ కార్యాలయంలో అందజేశారన్నారు.దరఖాస్తులు అందజేసిన వారిలో విజయవాడలోని 32 డివిజన్లలో అన్ని రకాల పప్పులు,నిత్యావసర సరుకులు, ఎంఎస్ఎంఈ యంత్రాలు, ఐరన్ వస్తువులు,పేపర్ బండిల్స్, క్లాత్ బండిల్స్, బియ్యం, పంచదార,ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తులు, గృహోపకరణాలు, ఆటోమొబైల్ పరికరాలు, ఆహార ఉత్పత్తులు, ఫర్నీచర్, ప్లైవుడ్, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, ఫ్లోర్ మిల్స్, కంప్యూటర్లు, ప్రింటర్లు వంటి అన్ని రకాల వ్యాపారులు, వర్తకులు ఉన్నారన్నారు. వ్యాపారుల నుంచి వచ్చిన దరఖాస్తులను కూలంకషంగా పరిశీలించి పూర్తిస్థాయి నివేదికను సీఎం చంద్రబాబు, ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వ్యాపారులను ఆదుకోవాల్సిందిగా కోరతామన్నారు.

ప్రజల సేవ చేయడం అభినందనీయం : యలవర్తి

విశాలాంధ్ర-గుడివాడ : దేవుని సేవ చేస్తు విపత్కర సమయంలో స్పందించి ప్రజలకు సేవా చేసేందుకు వేశపోగు విజయబాబు ముందుకు రావడం అభినందనీయమాని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక గుడ్‌మెన్ పేటలోని లావ్ అండ్ కంపాషన్, వేశపోగు జాకబ్ మోమెరియల్ చర్చి అధ్వర్యంలో నందివాడ మండలంలోని రామపురంలో బుడమేరు వల్ల మునిగిపోయిన గ్రామల ప్రజలకు నిత్యవసర, దుస్తులు, ఆహార ప్యాకేట్ల వాహనానికి యలవర్తి జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అదేశాలతో, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు మేరకు రూ. 2లక్షరూపాయిల విలువగల దస్తులు, ఆహార పాక్కేటు, నిత్యవసరవస్తువులు అందించడం గొప్ప విషయమన్నారు. వేశపోగు విజయబాబు చేస్తున్న సేవా కార్యక్రమంలో నేను అనేక పర్యాయములు పాల్గొనడం జరిగిందన్నారు. గతంలో పేద విద్యార్థులు, వింతత మహిళాలకు, కుష్టి వ్యాధిగ్రస్తులకు ఎన్నో సహాయంలు అందించడం జరిగిందన్నారు. అయన ఇటివల గుండెలో 2 స్టంట్‌లు వేయించుకున్నప్పటికీ సేవ చేసేందుకు ముందు రావడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వేశపొగు హన్నా, పాసర్లు జాక్‌టిమ్, జాక్‌బ్రెంట్ రాయ్, టిడిపి నాయకులు నిమ్మగడ్డ సత్యసాయి, కంచర్ల సుధాకర్, వేశపోగు ఇమ్మానియేల్, సంఘ పెద్దలు మామిళ్ల యేసురత్నం, వేసపోగు శ్యామ్, చింతకుంట్ల యోహాను, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మి గణపతిగా స్వామి వారిగా దర్శనం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విగ్నేశ్వరస్వామి వారి దేవస్థానంలో శనివారం గణపతి నవరాత్రి మహోత్సవాల భాగంగా 8వ రోజు శ్రీ లక్ష్మి గణపతి అలంకారంలో భక్తులకు దర్శించినమిచారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో ప్రసాద్, దేవస్థాన ధర్మకర్తల ఉత్యవ కమిటి చైర్మన్ సాయిన రాజేష్, సభ్యులు శలంకాయల లీలాకుమార్, లోయ వాసు, వికృతి పోతురాజు, పంచమర్తి శ్రీనివాసరావు, ఎరికిపాటి సుశీల, వీరమాచినేని శైలజ, తదితరులు పాల్గొన్నారు.